J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 33 20.01.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## గడప గడపకీ

# తిరగలేం బాబోయ్

- లబోదిబోమంటున్న ఎమ్మెల్యేలు
- అనారోగ్యమే కారణం అంటున్న కొందరు
- తిరగకపోయినా గెలవగలమని ఇంకొందరు
- టిక్కెట్టివ్వకపోయినా పరవాలేదంటున్న మరికొందరు

**వైసీపీలో ఏం జరుగుతోంది...? గడప గడపకి తిరగాలన్న ముఖ్యమంత్రి జగన్ నిర్ణయాన్ని ఆ పార్టీ ఎం.ఎల్. ఏలు వంద శాతం స్వాగతిస్తున్నారా...?? నాయకుడి ఆదేశాన్ని మనస్ఫూర్తిగా పాటిస్తున్నారా...??? ఇంటింటికీ వెళ్ళకపోతే తమ నాయకుడు తమనే ఇంటికి పంపిస్తాడని భయపడుతున్నారా...???? ఇలాంటి ఎన్నో భేతాళ ప్రశ్నలకు చాలామంది శాసనసభ్యుల దగ్గర నుండి "మౌనమే" సమాధానంగా వస్తుందని అంటున్నారు విశ్లేషకులు.**

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు, వచ్చిన తరువాత ఉన్న పరిస్థితులను ఒక్కసారి గమనిస్తే....

### అధికారంలోకి రాక ముందు....

2009లో రాజశేఖరరెడ్డి ఆకస్మికంగా దివంగతులైనప్పటి నుండి జనంలోనే ఉన్నాడు జగన్. ఓదార్పు యాత్ర పేరుతో ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టిన ఆయన, ఆ తరువాత చాలాకాలం దీక్షల పేరుతోనూ, పోరాటాల రూపంలోనూ ప్రజల మధ్యనే తిరిగాడు. 2014 నాటికి రాష్ట్రం విడిపోవడం, ఆ తరువాత జరిగిన ఎన్నికలలో జగన్ ఓడిపోవడం రెండూ ఆయన ఊహించని పరిణామాలు. ఇక్కడ నుండి తన పంథా మార్చుకున్నాడు. స్వతహాగా సొంత నిర్ణయాలతోనే కార్యాచరణ రూపొందించుకునే విధానానికి స్వస్తి పలికాడు.

ప్రశాంత్ కిషోర్‌ని వ్యూహకర్తగా నియమించుకుని రాజకీయ చతురతను పాటిస్తూ తన తండ్రి చేపట్టిన "ప్రజాప్రస్థానం" యాత్రకు ధీటుగా సరిగ్గా ఎన్నికలకు 18 నెలల ముందు 2017 నవంబర్ 6వ తేదీన "ప్రజా సంకల్పయాత్ర" పేరుతో పాదయాత్రను జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించాడు. జనవరి 9, 2019 వరకు 341 రోజులపాటు జనంలోనే ఉంటూ 3648 కిలోమీటర్ల ప్రయాణాన్ని కాలినడకన కొనసాగించాడు. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాలకు గాను 134 నియోజకవర్గాలలో ఆయన పాదయాత్ర ద్వారా తిరిగాడు. యాత్ర సమయంలో దాదాపు 2 కోట్ల మంది జనాభాని నేరుగా కలుసుకున్నాడు. "జనం కోసమే జగన్ - జగన్ వెంటే జగన్" అనే భావన కల్పించి తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను ఏర్పరచుకున్నాడు. దేశ చరిత్రలోనే అన్ని కిలోమీటర్లు నడచి అంత మంది జనం తలుపుతట్టి, వారి గుండెచప్పుళ్లను విన్న ఏకైక నాయకుడిగా ఘనతకెక్కాడు. 2019లో ఎలాగైనా అధికార పీఠంపై కూర్చోవాలన్న తపనను ఒక తపస్సుతో నెరవేర్చుకున్నాడు. 50 శాతం ఓట్లతో, తాను ఊహించినదానికంటే ఎక్కువ సీట్లు ఇచ్చి జనం జగన్‌ని ఆశీర్వదించారు.

### అప్పట్లో పోటీపడ్డ నాయకులు...

అప్పట్లో జనంలో జగన్‌కి వస్తున్న ఆదరణ చూసి ఇతర పార్టీల నాయకులు కూడా క్యూకట్టారు. జగన్ పార్టీలో చేరడానికి ఎగబడ్డారు. చివరికి ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థులుగా బరిలో దిగినవారు కూడా అఖరు నిముషంలో వైసీపీలోకి దూకేశారు. జగన్ కూడా గెలుపే లక్ష్యంగా భావించి ఎవరు వచ్చినా కాదనలేదు. మరీ ముఖ్యంగా టీడీపీ నుండి సీనియర్ నాయకులు ఆసక్తిగా ఉన్నారని సమాచారం వస్తే.. వెంటనే మంతనాలు జరిపించి వారికి పార్టీ కండువా కప్పేశాడు. అవసరం అనిపించిన చోట తనకూ, పార్టీకి విధేయులుగా ఉన్నవారిని సైతం ఒప్పించి వలసవాదులకే టిక్కెట్టు ఇచ్చాడు. నెల్లూరులో అత్యంత సీనియర్ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని, ఒంగోలులో సొంత బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డిని పక్కనపెట్టి నెల్లూరులో ఆదాల ప్రభాకరరెడ్డిని, ఒంగోలులో మాగుంట శ్రీనివాసులరెడ్డిని బరిలో దింపడమే ఇందుకు పెద్ద ఉదాహరణ. జగన్ పుణ్యమా అంటూ రాజకీయాలలో ఓనమాలు రానివాళ్లు, నామ్ నిషాని లేనివాళ్లు చాలా మంది శాసనసభ్యులుగా, శాసనమండలి సభ్యులుగా ఆంధ్రా రాజకీయ తెరపైకి వచ్చేశారు.

### అధికారంలోకి వచ్చాక...

అనూహ్యమైన విజయంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక చాలామంది ఊహలు, అంచనాలు తారుమారయ్యాయి. అప్పటివరకూ జనంతో మమేకమైన జగన్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న తరువాత కూడా అంతే స్థాయిలో

10లో






## కోవూరులో కోలాహలంగా..

# రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాలు

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని ఆనవాయితీగా ప్రతిఏటా నిర్వహిస్తున్న ఎడ్లపోటీల్లో భాగంగా కోవూరులోని కొత్తూరురోడ్డులో ఈనెల 13న ఎంతో కోలాహలంగా ఎడ్ల పరుగు పందాల పోటీలు జరిగాయి. 3 కిలోమీటర్ల దూరాన్ని ఏ జట్టు త్వరగా చేరుకుంటుందో ఆ జట్టుకు బహుమతి ఉంటుంది. కోవూరు బండ్లసంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలను తొలుత జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ప్రారంభించారు. సీనియర్ విభాగానికి జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా స్టువర్ట్‌పురానికి చెందిన బి.జయంతి ఎడ్లజట్టు ప్రథమస్థానం సాధించింది. కీ.శే నారపరెడ్డి రాధాకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి సోదరుడు శ్రీనివాసులురెడ్డి విజేతకు 15,116 రూపాయలను బహుకరించారు. అదేవిధంగా, ద్వితీయ బహుమతి సాధించిన ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరి ఎడ్లజట్టుకు దండి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సుబ్బమ్మ 13,116 రూపాయలను, తృతీయ బహుమతి సాధించిన ఎడ్లజట్టుకు కోవూరుకు చెందిన గాదిరాజు భాస్కర్‌రావు నగదు బహుమతిని అందజేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 35 ఎడ్ల జట్లు పాల్గొన్నాయి.

### జూనియర్ విభాగంలో :

ఎడ్లపరుగు పందాల్లో జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో కోవూరులోని చెర్లో సంఘం కాలనీకి చెందిన 'శ్రీ ఆంజనేయం' ఎడ్ల జట్టుకు ప్రథమ బహుమతి, నెల్లూరు నగరానికి చెందిన శ్రీ అభయాంజనేయస్వామి ఎడ్ల జట్టుకు ద్వితీయ బహుమతి లభించాయి. ఇందుకూరుపేట గంగపట్నం గ్రామానికి చెందిన పంచాల మోక్షితారెడ్డి ఎడ్లజట్టుకు తృతీయ బహుమతి, కోవూరుకు చెందిన శ్రీ చెన్నకేశవ స్వామి ఎడ్లజట్టుకు నాల్గవ బహుమతి లభించాయి. ఈ పోటీల్లో విజేతలందరికీ ప్రముఖ పారిశ్రామికవేత్త అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు శివుని నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మైథిలి థియేటర్ అధినేత వేమారెడ్డి వినీత్‌రెడ్డి పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు ఈ పోటీలను తిలకించడానికి రావడంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పీ వీరాంజనేయరెడ్డి, సిఐ రామకృష్ణారెడ్డిల నేతృత్వంలో ఎస్ఐలు డి.వెంకటేశ్వర్‌రావు, సుబ్బారావు, ఏఎస్ఐ సత్యనారాయణ గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

# కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు



9 మంది అరెస్ట్

సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి, వడ్లవారిపల్లి గ్రామాల సమీపంలోని అటవీప్రాంతాల్లో కోడిపందాల స్థావరాలపై ఎస్ఐ కిషోర్ బాబు, పోలీసు సిబ్బంది ఈనెల 14న దాడులు చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 కోళ్ళు, 6 మోటార్‌బైక్‌లు, 3500 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేస్తున్నామని, మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఎస్ఐ ప్రజలను కోరారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



మండల కేంద్రమైన సంగంలో ఉన్న శ్రీరామచంద్రాపురం కాలనీలో సంక్రాంతి పండుగల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక సమరసత సేవా ఫౌండేషన్ నాయకులు చెంచురెడ్డి, వైకాపా నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనంతసాగరంలో.. పేకాటరాయుళ్ళ అరెస్ట్

మండల కేంద్రమైన అనంతసాగరం శివారుల్లో పేకాట స్థావరాలపై ఎస్ఐ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈనెల 13న దాడులు చేసి, పేకాటాడుతున్న 9 మందిని అరెస్ట్‌చేశారు. అసాంఘిక కార్యక్రమాలను సహించేది లేదని, ఎక్కడైనా పేకాట, ఇతరత్రా జూదాలు, చీకటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే, తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం కొనుగోళ్ళ.. తీరు మారేనా?

## ● ఈసారైనా రైతన్నల కష్టాలు తీరేనా?

*మళ్ళీ వరి కోతకు వస్తోంది. వచ్చే నెల..అంటే ఫిబ్రవరి నెలాఖరు నుంచి వరి కోతలు మొదలవుతాయి. వరికి పుట్టినిల్లయిన నెల్లూరుసీమ పచ్చపచ్చని వరికంకులతో కళకళలాడుతోంది. ఎక్కడ చూసినా విస్తారమైన పంటపొలాలు కనువిందు చేస్తున్నాయి. అయితే, ధాన్యం కొనుగోళ్లు ఈసారైనా పూర్తిస్థాయిలో..సక్రమంగా జరిగి రైతులకు వరి పంట సిరులు పండిస్తుందా?..లేక గత సీజన్‌లో జరిగిన విధంగానే రైతుకు కన్నీటినే మిగిలిస్తుందా?..అన్నది ఇప్పుడు రైతులోకంలో సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. జిల్లాలో ఇప్పుడు దాదాపు 7.50 లక్షల హెక్టార్లలో వరి పంట సాగులోఉంది. సుమారు 15 నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నుల దాకా ధాన్యం దిగుబడి వస్తుందన్నది ఒక అంచనా. ఆ మేరకు కొనుగోళ్ళు పూర్తిస్థాయిలో జరిగేలా ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకోవాలన్నది జిల్లా రైతాంగం అభ్యర్థన.*



గత ఏడాది ఇదే సీజన్‌లో రైతులు ఎన్నెన్ని బాధలు పడ్డారో చెప్పలేం. ప్రభుత్వం వరికి గిట్టుబాటు ధర ప్రకటించినా, దళారులు, మిల్లర్ల బారిన పడకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు వెసులుబాటు కల్పించినా, తీరా ఆచరణకు వచ్చేసరికి రైతుకు నష్టాలే మిగిలాయి. జిల్లాలో ధాన్యం పుష్కలంగా పండినా, ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేకపోవడంతో రైతులు మళ్ళీ దళారులనో, మిల్లర్లనో ఆశ్రయించాల్సి వచ్చింది. కొన్న ధాన్యానికి డబ్బు చెల్లించడంలో జరిగే జాప్యం రైతులను ఆవేదనకు గురి చేసింది. అప్పోసప్పో చేసి పంటలు పండించుకున్న రైతాంగానికి ఇలాంటి సమస్యలన్నీ వేదనకు గురిచేస్తున్నాయి. పండిన పంటనంతా అంచనా వేసి, ఆ పంటను పూర్తిగా కొనుగోలు చేసి రైతులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు జిల్లా అధికారులు ఇప్పటినుంచే సంసిద్ధం కావాలి. ఇక్కడి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించి, రైతులకు సమస్యలు లేకుండా చూడాలి. కానీ, అధికారులు ఆ చొరవ చూపకపోవడంతో గత సీజన్‌లో రైతులు ఎన్నో అవస్థలకు గురయ్యారు.

### పండిన పంటనంతా కొనుగోలు చేయాలి :

పండిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నా, జిల్లాలో ఆ మేరకు ఏర్పాట్లు చేయడం లేదనే అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారైనా పంటనంతా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ఈసారి కూడా కనీసం 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వారు చెప్తున్నారు. గత సీజన్‌లో కూడా అంత స్థాయిలోనే దిగుబడి వచ్చింది. అయితే, ప్రభుత్వం గతంలో కొన్నది మాత్రం కేవలం నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనంటే అతిశయోక్తి కాదు. ఈసారైనా ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలి. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వం ధాన్యం కొంటున్నా, జిల్లాలో అధికారయంత్రాంగం కొనుగోళ్ళకు తగ్గ ముందస్తు ఏర్పాట్లు చేయలేకపోవడం, రైతుభరోసా కేంద్రాల్లో నిబద్ధతతో పనిచేసే సిబ్బంది కరువవడం, ధాన్యం ఆరబెట్టుకునేందుకు తగ్గ గోదాములు, ధాన్యం తెచ్చుకునేందుకు అవసరమైన గోతాలు పూర్తిస్థాయిలో లేకపోవడం వంటి సమస్యలన్నిటినీ ఉన్నతాధికారులు పరిశీలించి, తిరిగి ఆ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నదే రైతుల గోడు. గతంలో తేమశాతం నిర్ణయించడంలో అవస్థలు, మళ్ళీ మిల్లర్ల దగ్గరకే వెళ్ళడాలు, ధాన్యం అమ్మినా రైతు చేతికి డబ్బు అందకపోవడం వంటి సమస్యలు రైతులను కుంగదీశాయి. కొనుగోళ్ళ డబ్బులు వస్తేనే రైతులు చేసిన అప్పులు తీరాలి.. జీవనం జరగాలి. మళ్ళీ పంటలు వేసుకోవాలి..కనుక, ధాన్యం డబ్బు చెల్లింపుల్లో అశ్రద్ధ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### రైతుభరోసా కేంద్రాల్లో నిపుణులైన సిబ్బంది ఉండాలి :

ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరగాలంటే ముందుగా రైతుభరోసా కేంద్రాల్లో నిపుణులైన సిబ్బంది ఉండాలి. తేమశాతం నిర్ణయించే పరికరాలు, వాటి పట్ల అవగాహనతో పాటు రైతులతో సానుకూల దృక్పథంతో మాట్లాడి, వారికి అవసరమైన సేవలందించాలి. గత సీజన్‌లో రైతులకు ఇదే పెద్ద సమస్యగా తయారైంది. తేమశాతం పేరుతో లేనిపోని కుంటిసాకులు చెప్పి రైతులను మిల్లర్ల దగ్గరకు పంపడంతో, ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచినట్లయింది. కొనుగోలు చేస్తామన్న ధాన్యాన్ని కూడా కొనకుండా, రైతులను ఇబ్బంది పెట్టడం జరిగింది. ఎంత ధాన్యం పండిస్తున్నారు?.. ఎంత కొనుగోలు చేయాల్సి ఉంటుందనే అంచనాలున్నా, ధాన్యం కొనుగోళ్ళలో అవకతవక విధానాల వల్ల మళ్ళీ అనేకమంది రైతులు దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయలేకపోయింది. ఈసారైనా రైతు భరోసా కేంద్రాల వద్ద స్టాక్‌పాయింట్‌లు పెట్టి, తేమశాతాన్ని వెంటనే పరిశీలించి, ధాన్యం కొనుగోలుకు మార్గం సుగమం చేయాలి. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసే తేమశాతాన్నే పరిగణనలోకి తీసుకుని రైతులకు న్యాయం చేయాలి. అదేవిధంగా, కౌలురైతులు కష్టాల్లో పడకుండా, కౌలు కార్డు లేకున్నా ధాన్యం కొనుగోళ్ళకు తమను అనుమతించాలని కౌలురైతులు కోరుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ అంశాలన్నిటినీ పరిశీలించి రైతులందరికీ వచ్చే సీజన్‌లో కొనుగోళ్ళకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలి.

### ఇకెవైసి నమోదు అత్యంత ముఖ్యం

పంటకు తగ్గ గిట్టుబాటు ధర వచ్చేందుకు రైతులు కూడా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రైతులు వెంటనే రైతుభరోసా కేంద్రాలకు వెళ్ళి తమ పంట వివరాలను ఇకెవైసి చేయించుకోవడం ఎంతో అవసరం. ప్రభుత్వం చెప్తున్న నియమ నిబంధనలు పాటించి, తమ పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా, కొనుగోళ్ళు సక్రమంగా జరిగేలా చూసుకోవాలి. ఆ మేరకు అధికారులు కూడా ఇప్పటినుంచే రైతులను చైతన్యవంతం చేయాల్సివుంది.



# డాలస్‌లో నెల్లూరోళ్ళ సంబరం

సంక్రాంతి పండుగల సందర్భంగా అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఉన్న డాలస్ నగరంలో ఈనెల 13న నెల్లూరుకు చెందిన సుమారు వందమంది ప్రవాసభారతీయులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నెల్లూరీయుడు కృష్ణారెడ్డి ఉప్పలపాటి చొరవతో ఫ్రిస్కోలో ఉన్న 'శుభం ఈవెంట్ సెంటర్'లో అందరూ సమావేశమై శుభాకాంక్షలు చెప్పుకున్నారు. డాలస్ పరిసర మహానగరాల్లో ఏళ్ళ తరబడిగా స్థిరపడ్డ నెల్లూరుకు చెందిన అనేకరంగాల ప్రముఖులు, నాయకులు తదితరులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరుకు సంబంధించిన అనుభూతులను పంచుకున్నారు. నెల్లూరు భాషాయాసలతో హాయిగా మాట్లాడుకుని ఆనందించారు. సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ అందరి పూర్వాపరాలు తెలుసుకున్నారు. అంతా ఒక కుటుంబసభ్యుల్లా కలగలసిపోయి సందడి చేశారు. ఈ సమావేశంలో నెల్లూరుజిల్లాకు చెందిన స్థానిక తెలుగు సంఘాల మాజీ అధ్యక్షులు మరియు ఇతర ప్రముఖులు కోర్శపాటి శ్రీధర్‌రెడ్డి, ఎన్ఎంఎస్ రెడ్డి, మండువ సురేష్, ఉర్విడి నరసింహారెడ్డి, ఉప్పలపాటి కృష్ణారెడ్డి, యువచైర్మెన్ చిల్లకూరు గోపిరెడ్డి, కిష్టపాటి రమణారెడ్డిలతో పాటు డల్లాస్‌లోని ప్రముఖులు పాల్గొని నెల్లూరుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకొని పులకించిపోయారు.

# మార్చి 26 నుంచి.. ఇరుకళమ్మవారి జాతర

## 40 ఏళ్ళ తర్వాత మళ్లీ అమ్మవారి ఉత్సవాలు

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి జాతరను వచ్చే మార్చి 26వ తేది నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు ఘనంగా చేయాలని సంబంధిత దేవాదాయశాఖ అధికారులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 13న ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో వేదపండితులతో, దేవాదాయశాఖ అధికారులతో సమావేశమై ఏర్పాట్ల విషయం చర్చించారు. దాదాపు 40 ఏళ్ళ తర్వాత అమ్మవారి జాతర జరుగనుండడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే పెద్ద వేడుకగా మార్చి 26, 27, 28 తేదీల్లో అమ్మవారి జాతరను వైభవోపేతంగా నిర్వహించాలని భావిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నగరంలోని దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఇఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పర్వతరెడ్డికి సహకారం అందిస్తాం

## --- మద్దతు తెలిపిన ప్రభుత్వ అధ్యాపకులు ---



సేవాభావం కలిగిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని అభినందిస్తూ పలువురు ప్రభుత్వ అధ్యాపకులు ఇటీవల ఆయనకు తమ మద్దతు ప్రకటించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 18న నెల్లూరులోని కెవిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, డికెడబ్ల్యు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధ్యాపకులు సహకరించి తన విజయానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ సమస్యలను చంద్రశేఖర్‌రెడ్డికి తెలియజేయగా, ఆ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. అందుకు కాంట్రాక్ట్ అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## పోతిరెడ్డిపాళెంలో అభివృద్ధి పనులకు..

# ఎమ్మెల్యే ప్రసన్న ప్రారంభోత్సవం



కోవూరు నియోజకవర్గంలోని పోతిరెడ్డిపాళెం పంచాయతీలోని గుట్టకట్ట గ్రామంలో 'మనబడి నాడు-నేడు' పథకం కింద మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 24 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మౌళిక వసతులను ఈనెల 18న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా, పోతిరెడ్డిపాళెం గ్రామ పంచాయతీలో 'నుడా' సాధారణ నిధులు 50లక్షల రూపాయలతో నిర్మించిన సైడ్ కాలవలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. పోతిరెడ్డిపాళెం గ్రామ పంచాయతీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కేటాయించిన 15 లక్షల రూపాయల నిధులతో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవూరు ఎలక్ట్రికల్ సబ్ డివిజన్ కింద కోవూరు టౌన్, రూరల్, ఇనమడుగు సెక్షన్లలో హై-లో వోల్టేజీల సమస్యలను అధిగమించటానికి కోటీ 50 లక్షల వ్యయంతో 77 కొత్త అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశామని చెప్పారు. అదేవిధంగా, కోవూరు ఎలక్ట్రికల్ సబ్-డివిజన్ పరిధిలో కోటీ 64 లక్షల ఖర్చుతో 53,400 మీటర్ల పొడవునా విద్యుత్‌వైర్లను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# రాష్ట్రంలో పాలన గాడిన పడాలంటే.. టీడీపీ అధికారంలోకి రావాల్సిందే!

**- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి**



రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన సాగుతోందని, మళ్ళీ పరిపాలన గాడిన పడాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావల్సిందేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈనెల 18న ఎన్టీఆర్ 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన నెల్లూరు నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి, టిడిపి నాయకుడు అబ్దుల్‌అజీజ్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లెజెండరీ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన నాయకుడని కొనియాడారు. ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని, ఈ వర్ధంతి రోజున ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఆయనకు నివాళులర్పిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుభవం లేకుండానే రాజకీయాల్లోకి వచ్చిన ఎన్టీఆర్, దేశంలో కాకలు తీరిన నేతలకు రాని వినూత్న ఆలోచనలతో ప్రజలకు అపురూపమైన పథకాలెన్నో ప్రవేశపెట్టారన్నారు. పేద ప్రజల జీవితాల్లో సమూల మార్పులు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పక్కా ఇళ్ల నిర్మాణాన్ని తొలుత దేశానికి పరిచయం చేసింది ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. రాష్ట్రంలో పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు చేయడంతో పాటు, మహిళలకు ఆస్తి హక్కు కల్పన, మండల వ్యవస్థ ఏర్పాటు, హార్స్ పవర్ రూ.50కే ఏడాదంతా కరెంట్, రైతులకు వడ్డీ రాయితీ, సామాజిక పింఛన్ల వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాల సృష్టికర్త ఎన్టీఆర్ అని ప్రశంసించారు. ఏపీలో పరిస్థితులు మళ్ళీ గాడిలో పడాలంటే, చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 39వ భాగం




ధర్మరాజుకి యువరాజ పట్టాభిషేకాన్ని దుర్యోధనుడు జీర్ణించుకోలేకపోతున్నాడు. ఇలాంటి విషమ పరిస్థితిలో ఎలాంటి రాజధర్మం ఆనుసరించాలో అర్థం కావటంలేదు. అప్పుడు శకుని ఆప్త మంత్రి అయిన కణికుడు, దుర్యోధనునికి రాజదండ నీతి భోదిస్తాడు. శత్రువులని ఎలా మట్టుబెట్టాలో, తనని తాను రక్షించుకుంటూ, తనకపకారం చేసినవాళ్ళను ఎలా శిక్షించాలో అనేక విధాల వివరిస్తాడు. అది విని దుర్యోధనుడు పాండవులని ఎలా సంహరించాలో పథకం వేస్తాడు. తండ్రి దగ్గరకు వెళ్ళి, పాండవులని చూసి తనెంత భరించలేకపోతున్నాడో, ముందు వారి మీద ఆత్మీయతను దూరం పెట్టాలని అడిగినప్పుడు దృతరాష్ట్రుడు అంగీకరించడు. అయినా దుర్యోధనుడు, పాండవులుంటే తానింక జీవించలేనని, వారిని, కుంతిని వారణావత ప్రదేశం పంపమని ఒత్తిడి తెస్తాడు. దృతరాష్ట్రుడు అంగీకరించక, అలా అయితే, భీష్ముడు, ద్రోణ, కృప, విదురులు ఒప్పుకోరని అటువంటి ఆలోచన మానుకోవాలని హితబోధ చేస్తాడు. అయినా దుర్యోధనుడు వినకుండా అశ్వత్థామకి తనంటే ఇష్టమని, అందువల్ల ద్రోణ, కృపాచార్యులు తమతో ఉంటారని, భీష్ముడు తటస్తుడని, విదురుడు పాండవ పక్షపాతైనా తనంటే ఇష్టమని చెప్తాడు. చివరికి దృతరాష్ట్రుడు ఒప్పుకుంటాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**
**పూర్తి నిడివి కోసం**
**Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




లాయర్
జనవరి 20, 2023

# బాలికల పట్ల వివక్ష సమసిపోయేదెప్పుడు?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిపోయినా దేశంలో కోట్లాదిమంది బాలికలు నేటికీ వివక్షకు గురై నానా బాధలు పడుతూనే ఉన్నారు. అటు కుటుంబంలోనూ, ఇటు సమాజంలోనూ ఎక్కడ చూసినా బాలికల పట్ల నిరాదరణే తప్ప సమాదరణ కనిపించడం లేదు. పురాతన కాలం నుంచి బాలికల పట్ల ఘోరంగా వివక్ష కొనసాగుతూనే ఉంది. అసలు, ఆడపిల్ల పుట్టిందంటేనే సమాజంలో ఒక రకమైన చులకన భావం ఏర్పడుతోంది. దీంతో పుట్టినప్పటినుంచి బాలికలకు కష్టాలే ఆరంభమవుతుంటాయి. పాతకాలంలో నానా రకాల మూఢనమ్మకాలతో బాలికల బంగారుజీవితాలెన్నో బుగ్గి అయిపోయాయి. ఆరోజులెట్లో గతించి పోయినా, నేటి ఆధునిక కాలంలో కూడా బాలికల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. బాలికలకు హాయిగా నవ్వుతూ, స్వేచ్ఛగా చదువుకుంటూ కుటుంబంలో అందరిలా ఉండాలనుకోవడం కూడా ఒక కలగానే ఉంటోంది. నేటి తరంలో బాలికల కోసం కేంద్ర ప్రభుత్వంతో పాటు, ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా ఎన్నోరకాల పథకాలను, కార్యక్రమాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి బాటలు వేస్తున్నా, సమాజంలో మాత్రం బాలికల పట్ల ఉన్న చిన్నచూపు తగ్గకపోవడమే విచారకరం. బాలికల విద్యకు ప్రాధాన్యత బాగా పెరిగినా, దేశంలో చదువుకోలేని బాలికలెంతో మంది ఉంటున్నారు. బడికి వెళ్ళలేని పేదరికంతో, చేతనైన పనులు చేస్తూ కుటుంబాలను పోషించే బాలికలు బోలెడంతమంది.

నేటి ఆధునిక యుగంలో ఆడపిల్లలు తమ గళాన్ని గట్టిగా వినిపించే అవకాశాలు గతంలో కంటే బాగా పెరిగాయి. వారికి ఎన్నోరకాల హక్కులున్నాయి. అయినా వాటిని వారు సాధించుకోలేకపోతున్నాంటే వారికి సమాజం సహకరించకపోవడం ఒక పెద్ద లోపం. చిన్నవయసులో బాలికాదశలో తల్లితండ్రులో, కుటుంబసభ్యులో, సమాజంలో ఎవరో ఒకరి చేయూత లేనిదే వారెలా జీవితాల్లో రాణించగలరు? ప్రభుత్వాలు ఎన్నో విధాలైన ప్రోత్సాహకాలు అందిస్తూనే ఉన్నాయి. అయినా, వారిని ఉన్నత చదువుల దాకా చదివించుకోగలిగే తల్లితండ్రులెంతమంది?..చదువుకున్న వారిలో విద్యారంగంలో సమానమైన అవకాశాలను పొందలేని దీనస్థితి కూడా సమాజంలో ఇప్పటికీ ఇంకా తొలగిపోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఇంటా బయటా బాలికలకు అన్నీ అవరోధాలే..అన్నీ అవస్థలే. నిరుపేద, పేద, మధ్యతరగతి బాలికలు సమాజంలో ఎదురవుతున్న కష్టాలను చెప్పుకోలేక నేటికీ కంటతడిపెడుతూనే ఉన్నారు. బడులకు వెళ్ళి చదువుకోవాలన్నా ఒక పెద్ద సాహసంగానే ఉంటోంది. అన్నిటికీ మించి, బాలికలకు భద్రత ఉండడం లేదు. బాలికల పట్ల హింస, లైంగిక దాడులు వంటి అఘాయిత్యాలకు అంతే ఉండడం లేదు. ప్రభుత్వాలెంతగా రక్షణ కల్పిస్తున్నా సమాజంలో ఎక్కడో ఒకచోట బాలికలు అకృత్యాలకు బలైపోతూనే ఉన్నారు. అనేక పేద, మధ్య తరగతి కుటుంబాల్లో సరైన పోషకాహారం లభించక బక్కచిక్కిపోతున్న బాలికలెంతోమంది ఉంటున్నారు. ఏ వ్యాధులో వచ్చినా వారికి వైద్యం చేయించేవారు కూడా అంతంతమాత్రమే. ఇలాంటి అవస్థలన్నీ ఇకనైనా తొలగిపోవాలి.

కుటుంబాలను ఆదుకునేది మగపిల్లలే అనే భావం ఏనాటినుంచో సమాజంలో పాతుకుపోయి ఉంది. అయితే నిజానికి మగపిల్లల కంటే ఎక్కువగా ఆడపిల్లలే తల్లితండ్రులకు అన్నివిధాల ఆత్మీయంగా ఉంటూ సేవలు చేస్తుండడం అందరికీ తెలిసిందే. వాళ్ళకున్న అభిమానం మగపిల్లల్లో తక్కువేననడానికి బోలెడన్ని దృష్టాంతాలున్నాయి. 'కంటే కూతుర్నే కనాలి' అనేది ఇందుకే. ఆ పాతకాలపు ఆలోచనలతోనే నేటికీ వారిని చూడడం, ఆడపిల్లలనే వివక్ష పోకపోవడం వంటివి ఆడపిల్లల పాలిట శాపంగా మిగులుతోంది. ఆ న్యూనతాభావమే పెరిగి పెద్దయ్యాక కూడా జీవితాంతం వారిని వేధిస్తోంది. ఈ పరిస్థితులన్నీ మారాలి.

ఇకనైనా సమాజంలో లింగవివక్ష తొలగిపోవాలి. చిన్నతనం నుంచి బాలికలను అన్నివిధాలా ఆత్మస్థైర్యంతో బతికేలా చూడాలి. మానవతాహృదయంతో అందరూ బాలికలను ఆదరించి, వారు బాగా చదువుకునేలా ప్రోత్సహించి, వారి శ్రేయస్సుకు కృషి చేయాలి. ప్రతి కుటుంబంలోనూ బాలికల చిరునవ్వులు వెల్లివిరియాలి. అందుకు తల్లితండ్రులతో పాటు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. బాలికా దినోత్సవం సందర్భంగానైనా.. సమాజంలోని ప్రతిఒక్కరూ బాలికల బాగుకోసం.. వారి బంగారు భవిత కోసం కంకణబద్ధులు కావాలి.

**..... జనవరి 24 'అంతర్జాతీయ బాలికా దినోత్సవం'**

# 'వేమన జయంతి'ని.. ప్రభుత్వం నిర్వహించడం గొప్ప విషయం

మహాకవి, వేమన యోగి జయంతిని ప్రతి ఏటా జనవరి 19న అన్నిజిల్లాల్లో నిర్వహించాలని, ఆ మహాకవి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం గొప్ప విషయం. ఎంతో సంతోషకరమైన విషయం కూడా. నిజంగా ఆ మహాయోగికి ఇది అపూర్వమైన గౌరవం. వేమన అంటే కేవలం కవే కాదు..అనేక ప్రాంతాల్లో ప్రజలకు ఆరాధ్య దైవం కూడా. నేటికీ పలుప్రాంతాల్లో వేమనకు ఆలయాలున్నాయి. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట వద్ద కూడా వేమనకు దివ్యమైన దేవాలయం ఉంది. ఆ ఆలయాల్లో వేమనకు నిత్యపూజలు, ఏటా ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతూనే ఉన్నాయి. వేమనంటే మామూలు మనిషి కాదు..సమాజహితం కోసం పాటుపడిన మహామనీషి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనో రుషి. సమాజాభ్యున్నతి కోసం నాటి కాలంలోనే పాటుపడిన ఓ మహా సంఘసంస్కర్త. మన వేమన. అద్భుతమైన పద్యసంపదను మనకందించి తెలుగుభాషకు, తెలుగు పద్యానికి సాటిలేని ఖ్యాతిని తెచ్చారు. పాతకాలం నుంచి వేమన పద్యాలు తెలియని వారు ఉండరు. వేమన పద్యాలు చదవని విద్యార్థులసలే ఉండరు. పండిత పామరులందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో ఆయన పద్యాలు రాసిన తీరు అద్భుతం. చిన్న పదాలు, చిన్నచిన్న పంక్తులతోనే ఆయన గొప్ప సందేశాలను లోకానికి అందించి ప్రజలందరి మనసుల్లో శాశ్వత ముద్రను వేసుకున్నారు. సమాజంలోని చెడుపై, సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలపై పద్యాల అస్త్రాలను ఎక్కుబెట్టిన సాహసి.. మన తెలుగుతల్లి ముద్దుబిడ్డ..ప్రజాకవి వేమన. అనితరసాధ్యమైన రీతిలో వేలాది పద్యాలను ఎంతో హృద్యంగా మనకందించిన మన వేమనకు మనం ఏమిచ్చుకోగలం?.. ఆ మహాయోగి జయంతిని నిర్వహించడం ద్వారా ఆ మహనీయునికి ప్రజలందరి తరఫునా ఘనమైన నివాళులర్పించినట్లయింది. అందుకు ప్రభుత్వానికి హృదయ పూర్వక ధన్యవాదాలు. ఆ మహనీయునికి వందనాలు!...

**జె. మహేశ్వర్, తోటపల్లిగూడూరు.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# వీధిలైట్లు వెలిగించండి!

జిల్లాలోని పలు పల్లె ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తరచూ జరుగుతున్నాయి. కొన్ని చోట్ల అసలు వీధిలైట్లే వెలగడం లేదు. ముఖ్యంగా అనంతసాగరం మండలంలోని సోమశిల ప్రాజెక్టు కాలనీలో నెలలు తరబడి వీధి దీపాలు లేక కాలనీలోకి వెళ్ళాలంటేనే భయంగా ఉంటోంది. వీధుల్లో లైట్లు వెలగకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. అందులో రాత్రివేళల్లో ఈ ప్రాంతాల్లో పాములు తిరుగుతుంటాయి. మరోవైపు చీకటి. దీంతో ప్రజలు ఈ దారుల్లో పోవాలంటే భయాందోళనలు చెందుతున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా పెద్దగా స్పందించడం లేదు. జిల్లా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులైనా ఈ విషయం పరిశీలించి కాలనీ ప్రాంతాల్లో వీధిలైట్లు వెలిగించాలని ప్రార్థన!

**సి.కె. మనోహరయ్య, సోమశిల.**

# గట్లు తెగితే..ప్రమాదమే!



చెరువులకి కట్టలుంటాయి. నదుల పొంగి మీదపడకుండా పొర్లుకట్టలుంటాయి. ఏటి గట్లు తెగిపోకుండా ఆనకట్టలుంటాయి. ఏ తుఫాన్లో, వరదలో, భారీ వానలో వచ్చినప్పుడు నీటి ప్రవాహాలకి ఆ చుట్టుపక్కలున్న ప్రాంతాలనో, ఇళ్లనో ముంచకుండా అందరి ప్రాణాలు కాపాడేది ఆ గట్లే. అందుకే వాటిని అనునిత్యం ఎంతో జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి. ఆ గట్లు తెగితే ఎంత ప్రమాదమో చెప్పలేం. చెరువులకి గండ్లు పూడ్చకపోవడం వల్ల చెరువుల్లోని నీళ్ళన్నీ ఊళ్ళని ముంచిన సంఘటనలు బోలెడు. భారీవర్షాలు వచ్చినప్పుడు చెరువులు నిండి గండ్లు పడుతుంటాయి. బలహీనంగా ఉన్న చెరువు కట్టలను అవి బట్టబయలు చేస్తుంటాయి. అదేవిధంగా నదుల్లోకి నీటి ప్రవాహాలు వచ్చినప్పుడు, గట్లు తెగితే ఎంత నష్టమో గమనించి, భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు జరగకుండా శాశ్వత ప్రాతిపదికపై గట్లను గట్టిగా కట్టుకోవాలి. ఇవంతా చూసుకోవాల్సింది నీటిపారుదల శాఖ అధికారులు. పర్యవేక్షించాల్సింది జిల్లా ఉన్నతాధికారులు. అయినా ఎవరు పట్టించుకుంటున్నారనీ?... జిల్లాకు సంబంధించి అనేకచోట్ల చెరువుకట్టలు, పెన్నా నదీ పరీవాహక ప్రాంతాల్లోని పొర్లుకట్టలు బలహీనంగా ఉండడం అందరికీ తెలిసిందే. ఏళ్ళ తరబడిగా ఉన్న చెరువుకట్టలు ఎంతకాలమని పటిష్టంగా ఉంటాయి?.. ప్రవాహాలు వచ్చినప్పుడల్లా అనేక ప్రాంతాల్లో ప్రమాదాలు జరగడం చూస్తూనే ఉన్నాం. చెరువులు వాగులు వంకలు పొంగిపొర్లి ఎక్కడో రోడ్లమీదున్న ట్రాఫిక్‌ను కూడా ఆపేస్తుంటాయి. వాటిని

## సమస్యల తో 'రణం'

ముందుగానే నియంత్రించాలంటే చెరువుకట్టలు బలంగా ఉండాలి. నెల్లూరు నగర శివారుల్లో ఉన్న ప్రాంతాలు కూడా పొర్లుకట్టలు బలహీనంగా ఉండడం వల్లే ప్రవాహాలకు, ప్రమాదాలకు గురవుతూనే ఉన్నాయి. వాటిని ఇంకా పటిష్టం చేసుకునేదెప్పుడు?.. అన్నది జవాబు లేని ప్రశ్నగానే ఉంటోంది. గత ఏడాది పెన్నానది వద్దనున్న పొర్లుకట్టలు కోతకు గురై పలు ప్రాంతాలు ముంపుబారిన పడడం, ఇళ్ళలోకి నీళ్ళ ప్రవాహం వచ్చి అప్పటికప్పుడు పిల్లాపాపా అంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలోమంటూ పరుగులు తీయడం, రోడ్లన్నీ కాలువలైపోవడం అందరికీ తెలిసిందే కదా!..వర్షాలెప్పుడు వచ్చినా పెన్నా నది పొడవునా పలు ప్రాంతాల్లో ఉన్న పొర్లుకట్టలు బాగా దెబ్బతింటున్నాయి. పొలాల్లోకి నీళ్ళు ప్రవహించి నాశనం చేస్తున్నాయి. అయితే, వాటిని మరమ్మతులు చేయిస్తామని చెప్పడమే తప్ప, ఆ తర్వాత వాటి అతీగతీ పట్టించుకుంటున్న నాథులే ఉండడం లేదు. అక్కడక్కడా నాయకులెవరైనా గట్టిగా పట్టుబట్టినప్పుడు పనులు చేపట్టినా అవి కూడా నాసిరకంగానో, అవినీతికి ఆలవాలంగానో ఉంటున్నాయనే విమర్శలు కొల్లలు. అధికారులు శ్రద్ధతో పర్యవేక్షించకపోతే పరిస్థితి అలాగే ఉంటుంది. అరాకొరగా, నాణ్యత లేకుండా చేపట్టిన పనుల వల్ల ఏం జరుగుతుందో..మళ్ళీ భారీ వానలొస్తేగానీ తెలియదు. దీనికితోడు నది పొడవునా, ఎక్కడ వీలైతే అక్కడంతా పొర్లుకట్టలను కూడా తవ్విపారేసి, అక్కడున్న మట్టినీ, ఇసుకనూ కూడా బండ్లకెత్తుకుపోయే ఘనాపాటీలకూ కొదవలేదు. అందువల్ల ఆయా ప్రాంతాల ప్రజలకు ఎంత ప్రమాదమో తెలిసి కూడా అక్రమార్కులు పట్టించుకోరు. ఏదోవిధంగా డబ్బు సంపాదించాలనే ధ్యేయంతో ఎవరిష్టప్రకారం వాళ్ళు నదుల్ని, వాటిలోని ఇసుకను, పొర్లుకట్టల్లో ఉన్న మట్టిని కూడా నమిలి మింగేస్తూనే ఉన్నారు. నదుల్లోకి యదేచ్ఛగా వెళ్లేందుకు మరికొందరు చిత్తం వచ్చిన రీతిగా గండ్లు కొట్టి, వాహనాలు వెళ్లేందుకు దారులు వేసుకుంటుంటారు. దాంతో ప్రమాదాలకు దారులు తీసినట్లేనని వాళ్ళకి అర్థమయ్యేదెప్పుడు?.. ప్రవాహాలు వచ్చినప్పుడు వాటిని వెంటనే పూడ్చే పరిస్థితి లేక, ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఏడ్చే దుస్థితి దాపురిస్తోంది. ముందుగానే ఇలాంటి వాటిని పట్టించుకోవాల్సింది పోయి, దాహమైనప్పుడు బావి తవ్వుకుందామన్న తీరుగా, ప్రమాదం వచ్చినప్పుడు చూద్దాంలే..అనే నిర్లక్ష్య ధోరణితో మన అధికారులు ఉండడం విచారకరమని ప్రజల ఆవేదన. చెరువుల కట్టల పక్కన, నదుల చుట్టుపక్కలున్న గ్రామాల వారు ఎప్పుడు ప్రవాహాలొచ్చి, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని నిత్యం భయపడుతూనే ఉండేది ఇందుకే. వర్షాలొచ్చినప్పుడు పడిన గండ్లను సరిగా పూడ్చకపోతే, ఆ తర్వాత మళ్ళీ భారీ వర్షాలొచ్చినప్పుడు అవి మరింత పెద్దవై ప్రజలకు కడగండ్లుగా మారతాయి. వర్షాలకు నానిపోయి ఎంతటి కట్టడాలైనా కూలిపోతుంటాయనే విషయం ప్రత్యేకించి చెప్పేదేముందీ?..ఇక మట్టితో కట్టిన గట్లొక లెక్కా?.. ఇప్పటికైనా జిల్లాలోని ప్రతి చెరువును సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించడమే కాక, వాటి గట్టితనాన్ని పరిశీలించాలి. భవిష్యత్తులో కూడా అవి తెగకుండా మరింతగా పటిష్టం చేయాలి. నదులు పొడవునా, ఏటిగట్లమ్మటా ఎక్కడా గండ్లు పడకుండా, ఏర్లు పొంగకుండా, పొర్లుకట్టలు కట్టుదిట్టంగా ఉన్నాయో లేదో సర్వే చేయించాలి. ఒకవేళ ఎక్కడైనా గండ్లు పడివున్నా, కట్టలు బలహీనంగా ఉన్నా వెంటనే యుద్ధప్రాతిపదిక మీద వాటిని బాగుచేయించాలి. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ముందస్తుగా చేపట్టాల్సిన పనులివి. వీటిని అలక్ష్యంచేయడం ఎంతమాత్రం మంచిది కాదు. ఇప్పటికైనా వాటిని బాగుచేసుకుంటే, రానున్న వర్షాకాలంలోనైనా చెరువుగట్ల కింద నివాసం ఉంటున్నవారికి, నదుల పక్కన నివసిస్తున్న గ్రామాల్లోని ప్రజలకి కొంత భరోసా ఇచ్చినట్లవుతుంది. కాస్తంత భద్రతనైనా వారికి కల్పించినట్లవుతుంది.

**- సంచారి**



# వాడవాడలా..'సంక్రాంతి' వేడుకలు

సంక్రాంతి పండుగలు ఈ ఏడాది ఎంతో ఘనంగా జరిగాయి. వాడవాడలా సంబరాలు మిన్నంటాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సమాహారంగా కలసివచ్చే తెలుగువారి పెద్దపండుగలు ఇవే కనుక, 14,15,16 తేదీల్లో ఎక్కడ చూసినా పండుగల కోలాహలమే కనిపించింది. ఏళ్ళతరబడిగా సంప్రదాయబద్ధంగా వస్తున్న ఈ పండుగల వేళ కుటుంబసభ్యులంతా కలసి ఆనందోత్సాహాలతో గడిపారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు పల్లెల్లో మళ్ళీ సందడి చేశాయి. పిండి వంటలు, కొత్త దుస్తులు, ఆటపాటలతో హాయిగా జిల్లా ప్రజలు పండుగలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు వెళ్ళి ఇష్టదైవాలకు పూజలు చేసుకోవడం ఆనవాయితీ కనుక, ఆలయాలన్నీ భక్తుల రాకపోకలతో కళకళలాడాయి. నెల్లూరుజిల్లా అంతటా, ప్రత్యేకించి నెల్లూరు నగరంలోనూ సంక్రాంతి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఇంటింటా సంక్రాంతి ముగ్గులు, అనేక చోట్ల ముగ్గుల పోటీలు, క్రీడల పోటీలు, గాలిపటాలు ఎగురవేయడాలు మహిళలను, యువతను,బాలలను ఉత్సాహపరిచాయి. జిల్లా అంతటా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు వెల్లువెత్తాయి. భోగిరోజున భోగిమంటలు వేసుకున్నారు. సంక్రాంతి రోజున ఇళ్ళల్లో పిండివంటలతో పండుగ చేసుకున్నారు. పితృదేవతలను ఆరాధిస్తూ గతించిన పెద్దల సమాధుల వద్ద ప్రణమిల్లారు. కనుమ రోజున గోమాతలను, పశువులను అలంకరించి వేడుక జరుపుకున్నారు. నెల్లూరు నగరంలో సంక్రాంతి రోజున బోడిగాడితోటలోని సమాధుల వద్దకు కుటుంబసభ్యులతో సహా తరలివచ్చి పూజలు చేసుకున్నారు. సంక్రాంతి పండుగల శోభతో ఆలయాలన్నీ అలరారాయి. విద్యుద్దీప కాంతులతో మెరిసిపోయాయి. స్వామివార్లకు, అమ్మవార్లకు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు జరిగాయి. నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తల్పగిరి రంగనాథస్వామికి పార్వేట ఉత్సవం, ఆండాళ్ అమ్మవారికి పేట ఉత్సవం తదితర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైపాడు గేట్ వద్ద జాఫర్ సాహెబ్‌కాలువలో ఎంతో వేడుకగా భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామికి కనుమ పండుగ రోజు రాత్రి తెప్పోత్సవం మేళతాళాలతో, బాణాసంచా వేడుకలతో కనువిందుగా సాగింది. సంప్రదాయ బద్ధంగా స్వామివార్లకు కనుమ పార్వేట ఉత్సవాన్ని మరింత వేడుకగా నిర్వహించారు. వేలసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

**• అంబరాన్నంటే సంబరాలు**



# వవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్.. సూరా రాజీనామా



బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి ఛైర్మెన్ పదవికి ఈనెల 17న రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చొరవతోనే తాను 2013 నుంచి బ్యాంకు ఛైర్మెన్‌గా ఉన్నానని, ఈ పదేళ్ళలో బ్యాంకును ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు. తాను ఛైర్మెన్‌గా వచ్చినప్పుడు బ్యాంకు ఆదాయం కేవలం 70లక్షలు ఉండేదని, ఇప్పుడు 4.5 కోట్లకు పెరిగిందని తెలిపారు. తాను స్వచ్ఛంధంగా రాజీనామా చేస్తున్నానని, ఇందులో ఎలాంటి రాజకీయంలేదని, చివరిదాకా ఎమ్మెల్యే ప్రసన్న వెంటనే ఉంటానని స్పష్టం చేశారు. ఇదిలావుంటే, బ్యాంకులో అవకతవకలు జరిగాయంటూ తనపై అపవాదు వచ్చినందుకు మనస్తాపంతో ఆయన రాజీనామా చేసినట్లు సమాచారం.

# వింజమూరులో..ఆటోవాలాలకు కౌన్సిలింగ్

వింజమూరులోని ఆటోవాలాలకు ఎస్ఐ కుమార్ ఈనెల 13న కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటోల్లో అధికలోడ్ ఉండకూడదని, ఎక్కువమంది ప్రయాణీకులను ఎక్కించవద్దని, మితిమీరిన వేగం ప్రమాదకరమని హెచ్చరించారు. నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సీజన్‌లో పొగమంచు వాతావరణం వల్ల ఎదుట వచ్చే వాహనాలు సక్రమంగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, కనుక జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు.

# జన్మభూమికి..సతీష్‌రెడ్డి సేవలు

**• మహిమలూరు ప్రగతికి బాటలు**

తన సొంత ఊరైన ఆత్మకూరు నియోజకవర్గంలోని మహిమలూరు గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు, ఆ ఊరిలో జన్మించి దేశవ్యాప్త ఖ్యాతి పొందిన ప్రముఖ శాస్త్రవేత్త, భారత రక్షణశాఖ సాంకేతిక సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి సంకల్పించారు. సంక్రాంతి పండుగల నేపథ్యంలో ఆయన కుటుంబసమేతంగా మహిమలూరుకు వచ్చి పండుగ సంబరాలు చేసుకున్నారు. గ్రామస్తులందరినీ పేరుపేరునా ఆత్మీయంగా పలకించి అందరినీ ఆకట్టుకున్నారు. జిల్లాకలెక్టర్ మంజూరుచేసిన ప్రత్యేక నిధులతో గ్రామంలో డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఇటీవల శంకర్ నేత్రాలయ వారు నిర్వహించిన మెగా నేత్రవైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్నవారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆ శిబిరంలో వైద్యసేవలందించిన వారికి జ్ఞాపికలిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి గ్రామస్తులతో ముచ్చటించారు. మహిమలూరు పంచాయతీ పరిధిలోని కోటపాడు గ్రామాన్ని అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, త్వరలోనే అనంతసాగరం మండలంలోని బొమ్మవరం, కమ్మవారిపాళెం గ్రామాల్లో ప్రజలకు తాగునీటి వసతి కల్పిస్తూ వాటర్‌ప్లాంట్‌లు కూడా ఏర్పాటుచేయనున్నామని చెప్పారు. తొలుత ఆయన మహిమలూరులోని సాయిబాబా మందిరంతో పాటు పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఎంపిడిఓ శ్రీనివాసులు, వైద్యాధికారి డాక్టర్ అనూషా, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త కంచి పరమేశ్వర్‌రెడ్డి, ఆధ్యాత్మికవేత్త యానాదిరెడ్డి,



స్థానిక ప్రముఖులు వెలిశెట్టి నారాయణరావు, కరటంపాటి సుధాకర్, సర్పంచ్‌లు ఎంవిజె ప్రసాద్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి, వైకాపా నాయకులు సానా వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల డ్యామ్ సందర్శన :

భారత రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి ఈనెల 14న కుటుంబసభ్యులతో కలసి సోమశిల జలాశయాన్ని సందర్శించారు. అక్కడున్న జలాశయం క్రస్ట్‌గేట్లను, రెగ్యులేటర్లను పరిశీలించారు. తొలుత అనంతసాగరం చెరువుకట్ట వద్ద ఉన్న నాగమునేంద్ర స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యులు అల్లంపాటి రమణారెడ్డి, వైకాపా నేత బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ రోజున డా. సతీష్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలసి బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఇఓ వెంకటేశ్వర్లు వారికి స్వాగతం పలికి దైవదర్శనం చేయించారు.

# రైతాంగం భవిష్యత్తు అగమ్యగోచరం కాకుండా చూడండి

**కలువాయి సమావేశంలో మాజీమంత్రి ఆనం**

రైతు భరోసా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయని రైతులు ఆందోళనలో ఉన్నారని, యూరియా బ్లాక్‌మార్కెట్లో కొనుగోలు చేస్తూ రైతాంగం ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారంటూ పలువురు సభ్యుల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వాస్తవాలను దాచి పెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను ఇక నైనా మానుకొని రైతాంగం భవిష్యత్తు అగమ్యగోచరం కాకుండా సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వ్యవసాయశాఖ అధికారులకు హితవు పలికారు. ఇటీవల జరిగిన కలువాయి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, సిసి రోడ్లు, డ్రైన్ల పనులు చేపట్టి దీర్ఘకాలంగా చేసిన పనులకు బిల్లులు రాక స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున.. పనులు అసంపూర్తిగా.. పురోగతిలో లేకున్నాయని ఇంజనీరింగ్ అధికారులు ఈ సందర్భంగా సమావేశంలో పేర్కొన్నారు. అదేవిధంగా, నీటిపారుదల శాఖ, సోమశిల ప్రాజెక్టు కాలువ ఎస్‌కే ఎఫ్‌ఎఫ్ కెనాల్ పనులకు సంబంధించి గడిచిన ఏడాదిగా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు పనులను ఎక్కడికక్కడ నిలుపుదల చేసి ఉన్నారని సమావేశంలో అధికారులు తెలియజేయడంతో ఆనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కలువాయి మండల రైతాంగానికి జరిగే నష్టాన్ని ఎలా సవరించాలో నివేదిక ఇవ్వాలన్నారు. నూకనపల్లిలో యుద్ధ ప్రాతిపదికన త్రాగునీటి సమస్యకు పరిష్కారం కోసం సిఎండిఎఫ్ నిధులు 5 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు మరో 5లక్షలతో కలిపి 10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆనం ఈ సందర్భంగా చెప్పారు.

# ఆల్తూరి స్మారకంగా..చెడుగుడు పోటీలు

**• పాపిరెడ్డిపాళెంలో సందడే సందడి**
**• గిరీష్‌రెడ్డికి గ్రామస్తుల సన్మానం**

ప్రముఖ వదాన్యులు, దైవభక్తిపరాయణులు దివంగత ఆధ్యాత్మికవేత్త ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం తోటపల్లి గూడూరు మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో వారి కుమారులైన ఆల్తూరి సోదరులు జిల్లాస్థాయిలో చెడుగుడు పోటీలు నిర్వహించి యువతలో క్రీడాస్ఫూర్తిని నింపారు. ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఆల్తూరి మహేష్‌రెడ్డిల సారథ్యంలో రెండురోజుల పాటు ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ పోటీలు ఈనెల 14న ముగిశాయి. అనేక మంది క్రీడాకారులకు ఈ పోటీలు స్ఫూర్తిగా నిలిచాయి. గ్రామస్తులంతా పెద్దసంఖ్యలో ఈ పోటీలను తిలకించడం విశేషం. ప్రారంభం నుంచీ ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో క్రీడాకారులు పోటాపోటీగా ఆడారు. ఈ క్రీడల్లో పురుషుల విభాగంలో ముదివర్తి గ్రామానికి చంటి ఫ్రెండ్స్ జట్టు ప్రథమ బహుమతి సాధించి అందరి ప్రశంసలందుకుంది. అదేవిధంగా రాపూరు, ముదివర్తి, క్రైస్తవపాళెం, కెకె పాళెం, ఇందుకూరుపేట జట్లు వరుసగా మిగిలిన అయిదు స్థానాలు సాధించి బహుమతులందుకున్నారు. ఈ జట్లకు వరుసగా 20 వేలు, 15 వేలు, 10 వేలు, 8 వేలు, 6 వేలు, 4 వేల రూపాయల వంతున నగదు బహుమతులందజేశారు. మహిళల విభాగంలో పాపిరెడ్డిపాళెం జట్టు ప్రథమ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలందుకుంది. రెండో బహుమతిని సబ్బు నాగేశ్వరరావు ఫ్రెండ్స్ జట్టు, మూడో



బహుమతిని స్టేడియం జట్టు, నాలుగో బహుమతిని చిలుకల గ్రామం జట్టు, అయిదో బహుమతిని సంగం జట్టు గెలుపొందాయి. వీరికి వరుసగా 10 వేలు, 8 వేలు, 6 వేలు, 4 వేలు, 2వేల రూపాయల వంతున బహుమతులుగా ఇచ్చారు. అనంతరం పేడూరు సొసైటీ డైరెక్టర్ తిరువళ్ళూరు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఆల్తూరి గిరీష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరిగొండ శ్యామ్‌సుందర్‌రెడ్డి, కదురు వెంకటసుబ్బయ్య, దద్దోలు వెంకటకృష్ణయ్య, తిరువళ్ళూరు వెంకటేశ్వర్లు, జనార్ధన్, ధర్మయ్య, రాము, మోహన్, మురళి, హరి, కరిముల్లా పాల్గొన్నారు.

# వేడుకగా గోదాదేవి కల్యాణోత్సవం

**-- పాల్గొన్న పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య --**



నెల్లూరులోని 'సింహపురి సంక్రాంతి ఉత్సవ సమితి' ఆధ్వర్యంలో ఈనెల 13న గోదాదేవి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. నెల్లూరు నడిబొడ్డున శివాజీ సెంటర్‌లోని టీవీఎస్ కళ్యాణ్ సదన్ వద్ద సమితి అధ్యక్షులు బీవీఎన్ రంగరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో భారత 13వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆయన సతీమణి శ్రీమతి ఉషమ్మతో పాటు, డిఆర్‌డీఓ పూర్వ ఛైర్మెన్, భారత రక్షణ మంత్రిత్వశాఖ సాంకేతిక సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వినాయకస్వామి దేవస్థానం వద్ద నుంచి కోలాటాలు, మంగళ వాద్యాల నడుమ గోదాదేవి ఆండాళ్లను ఊరేగింపుగా కళ్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి వేడుకగా శ్రీ రంగ నాథస్వామి-గోదాదేవిల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు, స్థానిక ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# వెంకయ్యను కలిసిన చలమయ్య



ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు నెల్లూరుకు చెందిన కె.వి చలమయ్య ఇటీవల వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంకయ్యనాయుడును పూలమాలలతో సత్కరించి శ్రీ రాజరాజేశ్వరిదేవి, శ్రీ జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవార్ల ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు చలమయ్య ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని యోగక్షేమాలను విచారించారు.

# లింగనిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

**స్కానింగ్ సెంటర్లకు డిఎంఅండ్‌హెచ్‌ఓ హెచ్చరిక**

లింగనిర్ధారణ నేరమని, ప్రైవేట్ వైద్యశాలల్లో ఎవరైనా స్కానింగ్ చేసి లింగనిర్ధారణ చేస్తే కఠినచర్యలు తప్పవని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. ఇటీవల ఆయన వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో సీపీ అండ్ పీఎన్‌డిటి జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామని, వైద్యశాఖ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. లింగనిర్ధారణ చేసినట్లు తెలిస్తే ఆ సెంటర్లను సీజ్ చేయడమే కాక, కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, పలువురు డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.




## నెల్లూరు కబుర్లు

# శ్రీ రంగనాథుని సేవలో.. పొన్నవోలు



అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఈనెల 13న కుటుంబసమేతంగా నెల్లూరు నగరంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, ఇఓ వెంకటేశ్వర్లు వారిని సాదరంగా ఆహ్వానించి దైవదర్శనం చేయించి, స్వామివారి చిత్రపటాలను బహూకరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

# డాక్టర్ యల్లాప్రగడ సేవలు చిరస్మరణీయం



వైద్యరంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఇటీవల నెల్లూరులోని పొగతోటలో పివిఆర్ ఆసుపత్రి సమావేశ మందిరంలో డాక్టర్ యల్లాప్రగడ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య కుమార్‌రెడ్డిని సన్మానించారు. పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, గౌరవాధ్యక్షులు జయప్రకాష్, డాక్టర్లు వినీలారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు శేషయ్య, వీరయ్య, రామదాసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వాత్సల్యకు విరాళం




నెల్లూరులోని జనహిత-వాత్సల్య అనాథ శరణాలయానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.కోటేశ్వరరావు, డాక్టర్ టి.లక్ష్మి ఇటీవల లక్షా 8వేల రూపాయలను విరాళంగా అందజేశారు. వాత్సల్య కార్యదర్శి జివి సాంబశివరావుకు వారు ఆ విరాళం చెక్కును అందజేశారు.

# అవ్వారు శ్రీధరబాబుకు పురస్కారం



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, పెరసం (పెన్నా రచయితల సంఘం) అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు ఇటీవల రచించిన 'ఎగురుతున్న పర్వం' కవితా సంపుటికి గుంటూరులోని రావి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరంజక కవి ప్రతిభా పురస్కారం లభించింది. ఫిబ్రవరి 9వ తేదీన గుంటూరులో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. శ్రీధరబాబుకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించడం పట్ల స్థానిక కవులు, సాహిత్యాభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# పవర్ యూత్ దాతృత్వం



నెల్లూరులోని పవర్ యూత్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి రమేష్‌రాజు పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 17న నెల్లూరు నగరంలోని బ్రహ్మంగారి మఠానికి 15 కుర్చీలను వితరణగా అందజేశారు. అదేవిధంగా బుజబుజనెల్లూరులో 20 పేద కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. రమేష్‌రాజుతో పాటు సొసైటీ కోశాధికారి కమల్‌నాథ్, సభ్యులు అభిషేక్, సాయిరెడ్డి, సాయితేజ పాల్గొన్నారు.

**అర్హత కలిగిన పేదలకు..**

# త్వరలోనే ప్రభుత్వ భూములు

**జేసీ కూర్మనాథ్ వెల్లడి**

ఎప్పటినుంచో ప్రభుత్వ అసైన్డ్ భూములను సాగుచేసుకుంటున్న పేదరైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు పట్టాల పంపిణీకి జిల్లా అధికారయంత్రాంగం సిద్ధమవుతోందని జేసీ కూర్మనాథ్ వెల్లడించారు. ఈనెల 17న ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడారు. గతంలో జిల్లాలో 7 విడతలుగా భూపంపిణీ జరిగిందని, తాజాగా 8వ విడతలో నిరుపేదలకు భూపంపిణీ చేయనున్నామని ఆయన చెప్పారు. ఆమేరకు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా తెలిపిందన్నారు. నెల్లూరు డివిజన్‌లో 2400ఎకరాలు, కందుకూరు డివిజన్‌లో 550 ఎకరాలు పంపిణీ చేసేందుకు అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మొత్తమ్మీద 5వేల ఎకరాల భూములకు పట్టాలు ఇవ్వనున్నామని, గతంలో సిజెఎఫ్ఎస్ పట్టాలు ఇచ్చి రద్దు చేసిన వారికి, మాజీ మిలిటరీలకు, భూములు సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

**చుక్కల భూములకు పరిష్కారం :**

జిల్లాలో చుక్కల భూములకు సంబంధించి 26వేల మంది రైతులకు చెందిన సుమారు 44వేల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టామని జేసీ ఈ సందర్భంగా తెలిపారు. దీంతో ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న రైతులకు మేలు జరుగనుందన్నారు.

# ముగ్గురు తహశీల్దార్లపై వేటు

రెవెన్యూ రికార్డులు తారుమారు చేయడం, ప్రభుత్వ భూములను పట్టాభూములుగా చూపించి పరిహారం ఇవ్వడం, విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్న ముగ్గురు తహశీల్దార్ల వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి, వారిపై వచ్చిన ఆరోపణలు నిజం కావడంతో ఆ ముగ్గురినీ సస్పెండ్ చేశారు. వెంకటాచలం తహశీల్దార్ నాగరాజు, తోటపల్లిగూడూరు, గుడ్లూరు తహశీల్దార్లు హమీద్, లావణ్యలను సస్పెండ్ చేస్తూ ఈనెల 17న కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సస్పెండ్ చేశారు. వారిపై వచ్చిన ఆరోపణలను విచారించాల్సిందిగా జేసీ కూర్మనాథ్‌ను నియమించడంతో, జేసీ అన్ని కోణాల్లో విచారించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. కలువాయి మండలంలో ప్రభుత్వభూమిని ప్రైవేట్ వ్యక్తులదని పేర్కొంటూ అక్రమార్కులకు అండగా నిలిచారని, గుడ్లూరు మండలంలో ప్రభుత్వ భూమిని మ్యుటేషన్ చేశారని, మర్రిపాడు ప్రాంతంలో అటవీ భూములను సైతం పట్టా భూములుగా చూపారని, ఇలా అన్నిరకాల అక్రమాలను విచారించిన తర్వాత కలెక్టర్ వారిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. అక్రమార్కులకు సహకరించారన్న అభియోగంపై జిల్లాలో ఇంకా పలువురు తహశీల్దార్లపై కూడా విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది.

**ఆదాయపు పన్ను చెల్లింపులో..**

# అప్రమత్తత అవసరం

**ఉద్యోగులకు అదనపు కమిషనర్ అవగాహన**

ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఆదాయ పన్ను చెల్లింపుల్లో ఆయా శాఖల డిడివోలదే పూర్తి బాధ్యత అని విజయవాడ ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఆదాయ పన్నుకు సంబంధించి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి ఆదాయ పన్ను చెల్లింపు వ్యవహారాల్లో డిడిఓలు అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు ఆదాయ పన్ను వివరాలను పరిశీలిస్తూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫిబ్రవరిలో ఉద్యోగులకు సంబంధించిన ఇన్‌కం టాక్స్ బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆదాయపన్ను చెల్లింపునకు సంబంధించి పాత విధానం, కొత్త విధానం రెండూ అమలులో ఉన్నాయని, ఉద్యోగులు వారికి లాభదాయకమైన విధానంలో పన్ను చెల్లించాలని సూచించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ విభాగాల డిడిఓలతో ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూపును రూపొందించి, ఆదాయపన్ను చెల్లింపులకు సంబంధించి అన్ని సందేహాలను నివృత్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి ఉద్యోగి కూడా ఆదాయపన్ను విషయంలో అప్రమత్తంగా ఉంటూ, ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకుంటూ ప్రభుత్వ నిబంధన మేరకు పన్ను చెల్లించాలన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఆదాయ పన్ను శాఖ అధికారి ఎస్ రాజశేఖర్, జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ గంగాధర్, ఏటిఓ లోకేష్ బాబు, ఎస్టీఓ రహమాన్, డిడివోలు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



# భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు..
# మన పండుగలు

- స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ముప్పవరపు వెంకయ్యనాయుడు
- 'లాయర్' పత్రిక కాలమ్ కథనాల సంకలనం "లాయర్.. మనలో మాట" ఆవిష్కరణ

**సంక్రాంతి సందర్భంగా జన్మభూమి నెల్లూరుకు వచ్చిన భారత 13వ ఉపరాష్ట్రపతి, ఉషాపతి మన వెంకయ్యనాయుడు 6 రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల నుండి వచ్చిన తన అభిమానులను కలుసుకున్నారు.. ముఖ్యంగా తనకు పాత అనుబంధమున్న ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంత ప్రజలతో మాట మంతి కలిపారు. స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహిస్తున్న బ్రిడ్జ్ స్కూల్ చిన్నారులతో మమేకమయ్యారు. అక్షర స్కూల్‌లో వివేకానంద జయంతిలో పాల్గొన్నారు. అక్షర ప్రాంగణంలో కుటుంబసభ్యులతో కలసి సరదాగా గాలిపటాలు ఎగురవేశారు. భోగిపండుగ ముందురోజు ట్రస్ట్ ప్రాంగణంలోని ప్రజా మందిరంలో జరిగిన సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. అదే రోజు సాయంత్రం నగరంలోని శివాజీ సెంటర్‌లో జరిగిన గోదా కళ్యాణంలో ఉషమ్మ సమేతంగా పాల్గొన్నారు. 14వ తేదీ కుమారుడు హర్షవర్ధన్ ఇంట్లో భోగిమంట వేసి అదేరోజు ఉదయం బయలుదేరి చెన్నైకి వెళ్లారు.**





## సంక్రాంతి సంబరాలలో..

'భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చూపించి వారికి మన ఆచారాల గురించి తెలియజేయడానికి ఉపకరించే సరైన మార్గం మన పండగలను భక్తి పూర్వకంగా జరుపుకోవడమే' అని భారత పూర్వ ఉపరాష్ట్రపతి మన వెంకయ్య అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు అంటే కొత్త బట్టలు పిండి వంటలే కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయటంతో పాటు, మన పెద్దలు చూపిన మార్గంలో ముందుకు సాగాలన్న స్ఫూర్తిని అందిస్తాయని తెలిపారు. సంక్రాంతి అన్నది రైతుల పండుగ అని పేర్కొన్నారు. తెలుగు లోగిళ్ళకు సంక్రాంతి తొలి కాంతులను తీసుకువస్తుందని, మన ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలన్న షేర్ అండ్ కేర్ అనే భారతీయ ధర్మంలోని మూలసూత్రాన్ని ఈ పండుగ తెలియజేస్తుందని చెప్పారు. పాతను వదలి, నూతన మార్గంలో సాగాలనే సందేశాన్ని భోగి, పెద్దలను గౌరవించాలన్న సంకేతాన్ని సంక్రాంతి, ప్రకృతిని-పశుసంపదను కాపాడుకోవాలన్న స్ఫూర్తిని కనుమ పండుగలు అందజేస్తాయన్నారు.

మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకోవాలన్న స్ఫూర్తి దశాబ్దాల క్రితం రూపొందించిన భారత రాజ్యాంగంలోనే కనిపిస్తుందని వెంకయ్యనాయుడు అన్నారు. ప్రముఖ చిత్రకారుడు నందలాల్ బోస్ రాజ్యాంగ మూలప్రతిలో గీసిన చిత్రాల గురించి ఈ సందర్భంగా చెప్పారు. మహాభారతం, రామాయణం, అశోకుడు, గౌతమబుద్ధుడు జీవితాలను ప్రతిబింబిస్తూ రాజ్యాంగంలో కనిపించే చిత్రాలు కర్తవ్య పరాయణత్వం, సేవాభావం, మానవత్వం, జ్ఞానం, ధర్మపరాయణత్వం వంటి భారతీయ జీవన విలువల్ని ప్రతిబింబిస్తాయన్నారు. రాజ్యాంగ నకలుని సభలో ప్రదర్శించి మరీ ఈ ఆసక్తికర విషయాలను ఆయన వివరించారు. తాను ఇష్టపడే సేవా రంగంలో తమ కుమారుడు, కుమార్తె, కోడలు, అల్లుడితో పాటు మనుమడు మనుమరాళ్లు కూడా భాగస్వాముల్కై సేవా వారసత్వాన్ని కొనసాగించడం తనకు చాలా సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోందని వెంకయ్య అన్నారు.

ఈ వేడుకలలో వెంకయ్య సతీమణి ఉషమ్మ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, రైతుల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.




## లాయర్ "మనలో మాట" ఆవిష్కరణ

సీనియర్ జర్నలిస్టు భోగాది రాయుడు గత రెండు సంవత్సరాలుగా 'లాయర్' పత్రికలో 'మనలో మాట' పేరుతో రాసిన 101 కాలమ్ కథనాలను సంకలనంగా చేసి "లాయర్ మనలో మాట" పేరుతో ముద్రించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం భోగాది రాయుడిని అభినందించింది శాలువతో సత్కరించారు. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడమే కాకుండా "లాయర్ పత్రికలో భోగాది రాస్తున్న 'మనలో మాట'ని పుస్తక రూపంలో, స్వర్ణభారత్ సంక్రాంతి సంబరాలలో ఆవిష్కరించడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని, ప్రస్తుత దేశ కాలమాన పరిస్థితులపై యువతకు అవగాహన కల్పించే విధంగా వ్యాసాలు అందించిన రచయిత భోగాది వెంకటరాయుడుతో పాటు చొరవ తీసుకుని పుస్తక రూపంలో ప్రచురించిన తుంగా శివప్రభాత్‌రెడ్డికి అభినందనలు." అని వెంకయ్య ట్విట్టర్‌లో పేర్కొనడం భోగాది రాయుడుకి, 'లాయర్' పత్రికకి దక్కిన అరుదైన గౌరవం.

ఈ కార్యక్రమంలో భాగంగా త్రిభాషా అవధాని వద్దిపర్తి పద్మాకర్ సంక్రాంతి వైభవాన్ని తెలియజేశారు. ధర్మవరం సిస్టర్స్‌గా ప్రసిద్ధి చెందిన చిన్నారులు మహిత, ప్రణతి తమ గానామృతంతో అలరించారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ సంబరంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, స్వర్ణభారత్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. వెంకటాచలం సహా నెల్లూరు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ సంబరాలకి హాజరై సంబరపడ్డారు.







## బ్రిడ్జి స్కూల్ నిర్వహణకి ప్రతి ఏటా 50 లక్షలు..!

స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 'బ్రిడ్జ్ స్కూల్' నిర్వహణ కోసం సంవత్సరానికి అయ్యే 50 లక్షల రూపాయల వ్యయాన్ని ప్రతీ ఏడాది తాను అందజేస్తానని దీపమ్మ కుమార్తె సుష్మ మామయ్య, వైష్ణవి సంస్థల ఛైర్మన్ సి.ఎన్. గోవిందరాజులు సంక్రాంతి సంబరాలలో ప్రకటించారు. తొలి విడతగా 50 లక్షల రూపాయల చెక్కును కూడా దీపా వెంకట్‌కి అందజేశారు.




# శ్రీసిటీ.ఒక మోడల్ సిటీ

## ట్రైనీ ఐఏఎస్ అధికారులు



భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2022 బ్యాచ్‌కి చెందిన 20 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ వారికి స్వాగతం పలికారు. ప్రపంచశ్రేణి మౌళిక వసతులు, ప్రత్యేకతలతో పాటు దేశంలోని భారీ పారిశ్రామిక పార్కులలో ఒకటిగా శ్రీసిటీ ఆవిర్భావాన్ని, 'మేక్-ఇన్-ఇండియా' స్ఫూర్తితో అత్యంత వేగంగా ఉద్యోగాల కల్పనతో ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు శ్రీసిటీ ఎంతగా సహకరిస్తుందో వారికి వివరించారు.

అనంతరం వారు శ్రీసిటీని, పరిసరాలను సందర్శించారు. శ్రీసిటీలోని మౌళిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం అద్భుతమంటూ ట్రైనీ ఐఏఎస్‌ల బృందం నాయకుడు చిరంజీవ్ ఆనంద్ కొనియాడారు. శ్రీసిటీ.ఒక మోడల్ సిటీ అని అందరూ అభివర్ణించారు. శ్రీసిటీ వాతావరణం, పారిశ్రామిక మౌళిక సదుపాయాలు ఇక్కడ 'సులభతర వ్యాపారం', 'సులభతర జీవన సౌలభ్యాన్ని' నిర్ధారిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన పట్ల సంతోషం వ్యక్తం చేసిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. తమ పారిశ్రామిక అనుభవాలను వారితో పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు శ్రీసిటీ పరిసరాలను తిలకించడంతో పాటు భారత్ ఎఫ్ఐహెచ్ (ఫాక్స్‌కాన్), ఆల్‌స్టోమ్ పరిశ్రమలను సందర్శించారు.

# పేదల సొంతింటి కల సాకారం..సిఎం ధ్యేయం



చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కూడా నిర్మించి ఇవ్వాలనే దృఢ సంకల్పంతో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. ఈనెల 17వ తేదీన ఆయన వెంకటాచలం సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు చెప్పారు. వెంకటాచలంలోని జగనన్న లేఅవుట్ లో సుమారు 300 ఇళ్ల నిర్మాణాలకు అధికారులు మంజూరు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గతంలో ఎక్కడో ఒక సభపెట్టి పట్టాలు ఇచ్చి వెళ్లి పోయేవారని, ఆ పట్టాలు తీసుకుని స్థలాలు కనిపించక పేదలు ఇప్పటికీ తిరుగుతున్నారని, అలాంటి విధానానికి స్వస్తి పలుకుతూ ఒక లేఅవుట్ ఏర్పాటు చేసి పేదలను తీసుకెళ్లి ప్లాట్లు చూపించడంతో పాటు, ఇల్లు నిర్మించుకునేలా వినూత్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని చెప్పారు. లేఅవుట్లలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ, లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న రూ. 1.80 లక్షలతో పాటు, అదనంగా మరో 15 వేల రూపాయలు సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్లాట్లు మంజూరైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుస్మిత, తహశీల్దార్ నాగరాజు, మాజీ జడ్పీటీసీ మందల వెంకట శేషయ్య, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పండుగ రోజుల్లో ఫుల్లుగా తాగేశారు

## 27 కోట్ల మద్యం గుటకాయ స్వాహా

ఈ సంక్రాంతి పండుగ రోజుల్లో మద్యంబాబులు ఎంచక్కా ఫుల్లుగా తాగేసి మత్తులో జోగారు. ఏకంగా జిల్లాలో దాదాపు 27.77 కోట్ల రూపాయల మద్యాన్ని తాగేశారంటే అతిశయోక్తి కాదు. సంక్రాంతి పండుగల సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాల సమయం మరో గంట అదనంగా పెంచడంతో మద్యంషాపులన్నీ కిటకిటలాడాయి. ఈ నాలుగు రోజుల్లోనే జిల్లాలో మొత్తంగా 27 కోట్లా 77 లక్షలా 39వేలా 71 రూపాయల మద్యం విక్రయాలు జరిగాయని, 29,353 కేసుల మద్యం, 7,731 కేసుల బీరు బాటిళ్లు అమ్ముడుబోయాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

# మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రధానం

## గూడూరు డిఎస్పి సూర్యనారాయణరెడ్డి



మానసిక ఉల్లాసానికి, శరీరధారుఢ్యానికి క్రీడలు ప్రధానమని గూడూరు డిఎస్పి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ నెల 17,18 తేదీలలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారుల టీ షర్టులను డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, కనుమూరి హరిచంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైసిపి నాయకులు మనపాటి రవీంద్రబాబు, మునిగిరీష్‌ల చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల విభాగాలతో పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్, ప్రతినిధులు గోపి, మస్తాన్, కృపానిధి, నిరంజన్, మోహన్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు శివకుమార్, జనార్ధన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### విజేత ఎలక్ట్రానిక్ మీడియా

ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో ప్రింట్ మీడియా టీం పై ఎలక్ట్రానిక్ మీడియా టీం విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఆర్డీఓ కిరణ్‌కుమార్, డిఎస్పీ సూర్యనారాయణ, కమిషనర్ సాయినాథ్‌లు విజేతకు జట్టుకు ట్రోఫీని అందజేసి వారిని అభినందించారు.



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 18న గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తెదేపా నాయకులు, కార్యకర్తలు.

# ఆర్డీవో సమీక్షా సమావేశం



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గూడూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహశీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్లు, సూపర్‌వైజర్లతో ఆర్డీవో కిరణ్ కుమార్ ఈ నెల 18న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి శాఖ కోటలో డబుల్ సిమెంటు రోడ్ల నిర్మాణానికి 15కోట్ల రూపాయలు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# వైజేపీ లయన్స్ సేవా కార్యక్రమాలు



లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ సిఆర్ రెడ్డి దాతృత్వంతో వృద్ధులకు పలసరుకుల పంపిణీ మరియు వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు డి.రవీంద్రరెడ్డి దాతృత్వంతో 30 మంది పేద మహిళలకు చలికాలం సందర్భంగా దుప్పట్లు, భోజనం ప్యాకెట్స్ అందజేయడం జరిగింది. లయన్స్ క్లబ్ సభ్యులు ఆర్మీరావు, మురళీనాయుడు, గురునాథం, చంద్రశేఖరరెడ్డి, మురళి రాజు, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత విద్యాదాత..

# 'పద్మశ్రీ' నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి



విద్యారంగానికి నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి చేసిన సేవలు అపూర్వమని, విద్యాదాతగా ఆయన ఎందరో బాలల జీవితాలకు వెలుగు నిచ్చారని వక్తలు కొనియాడారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 15న బాలకృష్ణారెడ్డి జయంతి సభ జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి చేసిన మహోన్నతమైన విద్యాసేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఎంతో విశిష్టమైన 'పద్మశ్రీ' పురస్కారంతో వారిని సత్కరించిందని గుర్తుచేశారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుకుని ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నేటికీ వేలాదిమంది విద్యార్థులు ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో చదువుకుంటూ, సమాజంలో సమున్నతంగా రాణిస్తున్నారన్నారు. ఆ మహనీయుని ఆదర్శాల బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అఖిల్‌కు రోటరీ సాయం



నడవలేని స్థితిలో ఉన్న అఖిల్ అనే యువకుని వైద్య ఖర్చుల కోసం గూడూరు పట్టణ రోటరీ క్లబ్ సభ్యులు రూ. 70,000లు అందించారు. సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఆ సాయాన్ని అఖిల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కిరణ్‌చక్రవర్తి మాట్లాడుతూ అఖిల్ విషయం తెలుసుకుని వెంటనే స్పందించిన రోటేరియన్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా సహాయం చేసి ఒక కుటుంబాన్ని కాపాడడం గొప్ప కార్యక్రమమని, అఖిల్ కంప్యూటర్ కోర్సు చదివాడని, వైద్యం ద్వారా అఖిల్ నడవగలిగితే చాలా సంతోషమని, సాయం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# భారీ ట్యాంకర్లతో ప్రమాదాలు

**అరికట్టాలంటూ సిపిఎం వినతి**



నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలంటూ సిపిఎం నాయకుడు కాయం శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, బాబు, రఘు తదితరులు ఈనెల 14న నగర ట్రాఫిక్ డిఎస్పీ సుభానికి వినతిపత్రం అందజేశారు. కృష్ణపట్నం పోర్టు నుంచి జాతీయరహదారిపై వెళ్ళాల్సిన వాహనాలు, సిమెంట్ ట్యాంకర్లు చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు మీదుగా వెళ్తున్నాయని, అసలే రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో భారీ వాహనాలు వెళ్తుండడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి ఆ వాహనాలను నియంత్రించాలని వారు కోరారు.

# వేడుకగా మనుబోలమ్మ గ్రామోత్సవం

మండల కేంద్రమైన మనుబోలులో భోగిపండుగ సందర్భంగా ఈనెల 14వ తేదిన మనుబోలమ్మ అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో దేదీప్యమానం చేశారు. ఆలయ అర్చకులు నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి, నాగవల్లి పత్రాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామదేవతలైన గంగమ్మ, నాగవరపమ్మ దేవతలకు కూడా పెద్దఎత్తున పూజలు చేశారు. అనంతరం కన్నులపండువగా మనుబోలమ్మ అమ్మవారికి పల్లకిసేవ చేపట్టారు. గ్రామోత్సవం ప్రారంభం కాగానే గ్రామస్తులంతా ఆనందోత్సాహాలతో గ్రామంలో భోగిమంటలు వేశారు. అనంతరం తప్పెట్లు తాళాలు, మంగళవాద్యాలతో, బ్యాండ్‌మేళాలతో అమ్మవారిని గ్రామవీధుల్లో వైభవంగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

**ఒక్కరోజులోనే మాలకొండకు**

# రూ.10.99 లక్షల ఆదాయం

సంక్రాంతి పండుగల సందర్భంగా ఈనెల 14న శనివారం కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెంలో ఉన్న మాలకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి రూ.10,99,163 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలియజేశారు. భక్తుల కానుకలు, అన్నదానానికి విరాళాలు, టిక్కెట్ల విక్రయం తదితరాలన్నీ కలిసి ఆ ఒక్కరోజే ఆలయానికి ఈ మొత్తం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

# వలంటీర్లకు దుస్తుల వితరణ



జొన్నవాడ దేవస్థానం ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ దంపతులు, తమ కుటుంబసభ్యులతో కలసి ఈనెల 14న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని సచివాలయం సిబ్బందికి, వలంటీర్లకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేసి ప్రజలకు వారు చేస్తున్న సేవలను కొనియాడారు. వారందరికీ సంక్రాంతి పండుగల శుభాకాంక్షలు తెలిపారు. పుట్టా ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో గదుల అద్దె తగ్గించాలి

తిరుమలలో గదులకు పెంచిన అద్దెలను తగ్గించాలని బిజెపీ నేతలు కోరారు. ఇటీవల వారు నెల్లూరు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, అనంతరం జేసీ కూర్మానాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, నాయకులు సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, యశ్వంత్ సింగ్, రమేష్, గిరికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**ఫిబ్రవరి 8 నుండి**

# రాపూరులో క్రీడా సంబరాలు

**మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి**

98వ గ్రిగ్ మెమోరియల్ టోర్నమెంట్‌లో భాగంగా... నెల్లూరు జిల్లా సెకండరీ స్కూల్స్ అథ్లెటిక్ అసోసియేషన్ గేమ్స్ మరియు స్పోర్ట్స్ నిర్వహణ కోసం సెంట్రల్ మరియు జోన్ స్థాయి క్రీడా సంబరాలను రాపూరు కేంద్రంగా నిర్వహిస్తున్నామని మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 8-9-10 తేదీల్లో జోన్ స్థాయిలో, ఫిబ్రవరి 15-16-17 తేదీల్లో జిల్లా స్థాయిలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాపూరులోని ప్రభుత్వ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఇంటిగ్రేటెడ్ మరియు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంగణాలను సంబంధించిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆనం చెప్పారు.

# ఘనంగా పద్య సారస్వత పరిషత్.. 5వ వార్షికోత్సవం



పద్య సారస్వత పరిషత్‌ను స్థాపించి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, పర్వదినమైన వివేకానందుని జన్మదినోత్సవం రోజైన జనవరి 12న వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరులోని బాలాజీనగర్‌లో ఉన్న యలమందయ్య ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ పద్యకవి ఊరుబిండి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షత వహించారు. వివేకానంద విద్యాసంస్థల వ్యవస్థాపకులు యలమందయ్య ముఖ్య అతిథిగా పాల్గొని పద్య సారస్వత పరిషత్ వారు తెలుగు భాషాభివృద్ధికి, పద్య సారస్వతానికి చేస్తున్న కృషిని కొనియాడారు. సంస్థ ప్రధానకార్యదర్శి డాక్టర్ బీమకుర్తి వెంకటేశ్వరరావు సంస్థచే నిర్వహించిన కార్యక్రమాలు, ప్రవచనాలను వివరించారు. శ్రీ రామకృష్ణాశ్రమ నిర్వాహకులు కె.లక్ష్మీనారాయణ వివేకానందస్వామి జీవితాన్ని, వారి రచనల వైశిష్ట్యాన్ని వివరించారు. విశ్రాంత ఆంధ్రోపన్యాసకురాలు డాక్టరు కె.గిరిజాలక్ష్మి పాల్గొని మన ప్రాచీన సంస్కృతి వైభవాన్ని తెలిపారు. డాక్టర్ శ్రీరామకృష్ణ ప్రసాదరావు కవిసమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవధాని కోట రాజశేఖర్, ప్రముఖ కవులు తంగిరాల వెంకట నరసింహకుమార్, కోట శ్రీరామమూర్తి, దేవరకొండ మురళీకృష్ణ, శ్రీమతి గోవిందరాజుల సుభద్రాదేవి, గుండాల నరేంద్రబాబు పాల్గొని తమ కవితలను వినిపించారు. కోశాధికారి సూరం చంద్రశేఖరం వందన సమర్పణ చేశారు.

# బుచ్చిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బుచ్చిరెడ్డిపాళెంలోని డివిఎన్ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో ఈనెల 14న 1998-99 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు 21 ఏళ్ళ తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలసి హైస్కూల్‌కు తరలిరావడంతో అంతా పండుగ వాతావరణం కనిపించింది. విద్యార్థులు తమ పాఠశాల చదువుల నాటి సంగతులు జ్ఞాపకం చేసుకుని ఆనందించారు. పాఠశాలంతా సంతోషంగా కలయదిరిగారు. ఇప్పుడు ఎవరెవరు ఎక్కడున్నారో, ఏ ఉద్యోగాల్లో ఉన్నారో తెలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు విచారించుకున్నారు. తమకు చదువుచెప్పిన నాటి ఉపాధ్యాయులను గౌరవించి సన్మానించారు. ఉపాధ్యాయులు కొండయ్య, వెంకటేశ్వర్లు, మాణిక్యమ్మ, జయబాలతో పాటు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

# టూకీగా...

**జొన్నవాడలో.. వైభవంగా**

## శ్రీ కామాక్షితాయి కల్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కొలువైవున్న శ్రీ గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 13న స్వామివారికి- అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేసి, వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ఛైర్మెన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఇఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

**కొడవలూరులో.. పంటనమోదుపై**

## రైతులకు అవగాహన

కొడవలూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి సిహెచ్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 13న జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో రైతులకు పంట నమోదుపై అవగాహన కల్పించారు. పంటల నమోదుపై రైతులు ఆసక్తి చూపి ప్రతిరైతు ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. సలహామండలి సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లపల్లిలో.. భూముల రీసర్వే పరిశీలన

విడవలూరు మండలంలోని పార్లపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను ఈనెల 13న కావలి ఆర్డీఓ శీనానాయక్ పరిశీలించారు. ఈ ప్రక్రియ వల్ల భూముల హక్కుదారులకు ప్రయోజనం కలుగుతుందని, సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన అధికారులకు చెప్పారు. భూముల రీసర్వేను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. తహశీల్దార్ చంద్రశేఖర్, విఆర్ఓలు పాల్గొన్నారు.

## నెల్లూరులో.. పేదలకు దుప్పట్లు పంపిణీ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నెల్లూరులోని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, వివికే ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న సుబేదారుపేటలో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**చేవూరులో.. రోగులకు**

## 'ఫ్యామిలీ డాక్టర్' వైద్యపరీక్షలు

గుడ్లూరు మండలంలోని చేవూరు గ్రామంలో దీర్ఘకాలంగా వ్యాధులతో సతమతమవుతున్న 62 మందికి 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం కింద వైద్యాధికారి మారుతీరావు ఈనెల 13న రోగుల ఇళ్ళకు వెళ్ళి వైద్యపరీక్షలు చేసి వారికి ఆరోగ్య సలహాలిచ్చారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారు ఆ సమాచారాన్ని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు తెలియజేసి తగు వైద్య చికిత్సలు పొందాలని సూచించారు.

**ముంగమూరులో..**

## ఆదరణ కేంద్రానికి దాతల వితరణ

బోగోలు మండలంలోని ముంగమూరులో ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో ఉంటున్న అనాథలకు ఈనెల 13న హైదరాబాద్‌కు చెందిన షేక్ పర్వేజ్ కుటుంబ సభ్యులు నాలుగు మంచాలు, అనాథలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ కె.సింహాద్రిరావు, ఎస్‌కె సమీవుల్లా బాషా మిత్రబృందం పాల్గొన్నారు.

## కందుకూరులో.. అంకమ్మతల్లి ఆలయానికి విరాళం

కందుకూరులో నిర్మాణంలో ఉన్న శ్రీ అంకమ్మతల్లి ఆలయానికి దాత పబ్బిశెట్టి నరసింహస్వామి ఈనెల 14న 25,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని కందుకూరులోని ఆయన కార్యాలయంలో కలసి విరాళం చెక్కును అందజేశారు. కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

**ముసునూరువారిపాలెంలో..**

## గిరిజనులకు చీరల పంపిణీ

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని ముత్తుకూరు మండలంలోని ముసునూరువారిపాలెం పంచాయతీలోని గిరిజన మహిళలకు స్థానిక సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన.. సతీష్‌రెడ్డి

- పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం
- 'ఆత్మనిర్భర్ భారత్'ను బలోపేతం చేయాలని పిలుపు



ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని బలోపేతం చేయడం కోసం పలు వినూత్న తయారీ పద్ధతుల ద్వారా తయారీ రంగాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని కేంద్ర రక్షణ శాఖ సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17న ఆయన శ్రీసిటీలో పర్యటించి స్థానిక పరిశ్రమల సీనియర్ మేనేజర్లతో సమావేశమయ్యారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి పరిశ్రమల ప్రతినిధులకు పరిచయం చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో తమ సత్తా చాటేందుకు పరిశ్రమలకు ఇది సరైన అవకాశంగా తాను భావిస్తున్నానని అన్నారు. ఈ సమావేశంలో 'వినూత్న తయారీ – ఆత్మనిర్భర్ భారత్' అంశంపై ప్రసంగించిన డాక్టర్ సతీష్‌రెడ్డి, నూతనత్వానికి పెద్దపీట వేస్తున్న భారత ప్రభుత్వం, రక్షణ శాఖతో సహా అనేక రంగాలలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాల ద్వారా చురుకైన విధానాలతో స్వదేశీ సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో స్వయం సమృద్ధి ఆవశ్యకతను తెలియచేస్తూ, గుర్తించిన రంగాలలో కేంద్రీకృత పరిశోధనలు చేయడం కోసం విద్యాసంస్థలతో కలిసి నడవాల్సిన అవసరం ఉందని వివరించారు. వివిధ విధానాల రూపకల్పనలు, నిరంతర చర్యలు, సాంకేతిక బదిలీల ద్వారా దేశీయ పరిశ్రమ సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. భారతదేశాన్ని అధునాతన తయారీ కేంద్రంగా మార్చడానికి ఇవి దోహదపడతాయన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి ప్రభుత్వ విధానాల ఫలితంగా అనేక కొత్త అవకాశాలు వస్తాయని, దేశంలో పరిశోధనలు మరియు ఉత్పాదకానుకుల పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఇవి సహకరిస్తాయని తెలిపారు. శ్రీసిటీలో జరుగుతున్న వేగవంతమైన పారిశ్రామిక పురోగతిని అభినందిస్తూ, కొన్ని పరిశ్రమలు దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఉత్పత్తులు చేపట్టడంతో పాటు, గణనీయంగా ఎగుమతులు కూడా చేస్తూ 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారాన్ని ప్రోత్సహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పైన పేర్కొన్న అంశాలపై ప్రభుత్వ దృక్పథాన్ని మెరుగుపరిచేందుకు సూచనలు ఇవ్వాలని ఆయన పరిశ్రమ ప్రతినిధులను కోరారు. తన ప్రసంగం అనంతరం వివిధ అంశాలపై పలువురి సందేహాలను నివృత్తి చేశారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలను సందర్శించిన డాక్టర్ సతీష్‌రెడ్డి, బ్యూరోలెక్స్ పరిశ్రమను సందర్శించి, ఉత్పత్తుల తీరును పరిశీలించారు.

# గడప గడపకీ తిరగలేం బాబోయ్

(మొదటి పేజీ తరువాయి)

జనం మధ్యలోనే ఉంటాడని ఊహించిన వారి ఆశలు ఆడియాశలయ్యాయి. పార్లమెంటు సభ్యుడిగా, శాసనసభ్యుడిగా, శాసన మండలి సభ్యుడిగా ఆయనను నిత్యం కలుసుకుంటూ ఆయనకు తాము మరింత దగ్గరైపోదామని కలలుకన్న చాలామంది కలలు కల్లలుగానే మిగిలిపోయాయి. రాజశేఖరరెడ్డి తరహాలో జగన్ మోహన్‌రెడ్డిని కూడా ఎప్పుడు కావాలన్నా కలుసుకోవచ్చు అనుకున్న వారి అంచనాలు తారుమారయ్యాయి. అప్పటిలా ఇప్పుడు వేకువఝాము అపాయింట్‌మెంట్లు లేవు, ఉదయం ప్రజాదర్బారు లేదు. 3గంటలకు సెక్రటేరియట్, 6 గంటలకు క్యాంపు కార్యాలయం తరహా దర్శనాలు అసలే లేవు. ఇప్పుడున్నదల్లా ఉదయం పూట రివ్యూలు, మధ్యాహ్నం 3గంటల నుండి 5 గంటల వరకు అత్యంత ముఖ్యమైన వారితో సమావేశాలు మాత్రమే. జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు కాదు కదా.. కనీసం ఆయన క్యాంపు కార్యాలయం దరిదాపులకు కూడా వెళ్లే అవకాశం ప్రజాక్షేత్రంలో గెలిచిన ప్రజాప్రతినిధులెవ్వరికీ లేదు. కనీసం సీఎం కార్యాలయంలో పనిచేసే కొంతమంది అధికారులను కలుసుకునే భాగ్యం కూడా గెలిచిన నాయకులకు లేదు.

బటన్ నొక్కే పనిలో భాగంగా ముఖ్యమంత్రి తమ ప్రాంతానికి వచ్చినప్పుడు కావాలంటే కలవొచ్చు, అందుకు కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలి. లేదా జగన్మోహన్‌రెడ్డి ఎవరినైనా కలవాలనుకుంటే అక్కడి నుండి పిలుపొస్తే వెళ్లాల్సిందే తప్ప మరో అవకాశమే లేదు. అపాయింట్‌మెంట్ అడిగే ధైర్యమూ ఎవరికీ లేదు. ఒకవేళ ధైర్యంచేసి అపాయింట్‌మెంట్ అడిగినా అనుమతి వచ్చే అవకాశమూ అందరికీ లేదు.

## ఎన్నికలొస్తున్న వేళ గడప గడపకి వెళ్లమంటున్నారు...

మరో 16 నెలల్లో ఎన్నికలు రానేవస్తాయి. అంటే మరో పది నెలల్లో పార్టీల హడావుడి జోరందుకుంటుంది. ఎత్తులు, పైఎత్తులు, రాజకీయ జిత్తులు మొదలైపోతాయి. ఈ తరుణంలో జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు పెడుతున్నాడు జగన్. "నేను తిరిగాను, నేను విన్నాను, నేను ఉన్నాను అని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా అంటే 90 శాతం నెరవేర్చాను, ఇప్పుడు ప్రజాక్షేత్రంలో తిరగాల్సింది మీరు, చేసింది చెప్పడం మీ బాధ్యత, ఈసారి 175కి 175 కొట్టడం మన లక్ష్యం, అలా కొట్టగలిగితే మరో ముప్పై సంవత్సరాలు మనకు తిరుగులేదు" అని ప్రతి సమావేశంలోనూ ఆయన మాట్లాడుతున్నాడు. హోంవర్క్ చేయకపోతే చిన్నప్పుడు స్కూల్లో టీచర్ 'స్టాండప్ ఆన్ ది బెంచ్' అని బెంచిపై నిలబెట్టినట్లుగా గడప గడపకి తిరగని వాళ్ళ పేర్లు బోర్డుపై రాసి మరీ అందరికీ చూపిస్తున్నాడు. ఇది చాలామందికి నచ్చడంలేదన్నది కొంతమంది శాసనసభ్యులే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. తమ ఆరోగ్యాలు సహకరించడంలేదని కొందరు, తాము కొన్ని దశాబ్దాలుగా రాజకీయాలలో ఉన్నాం, ఇప్పుడు కొత్తగా వెళ్లి ఓట్లు అడుక్కోవలసిన అవసరం లేదని మరికొందరు, ఇలా ఎవరికి తోచిన ఇబ్బందులు వాళ్ళు చెప్తూ గడప గడప పర్యటనపై విముఖత చుపిస్తున్నారన్నది పార్టీ వర్గాల సమాచారం. కొంత మందైతే మాకు ఆయన టిక్కెట్టు ఇవ్వకపోయినా పరవాలేదు మేం వెళ్ళం అని చెప్తున్నారని అంటున్నారు.

తానొక్కడి కష్టంపైనే పార్టీకి 151 సీట్లు వచ్చాయన్నది జగన్ ధీమా. తాను ఎవరికి టిక్కెట్టు ఇస్తే వాళ్ళే గెలుస్తారన్నది కూడా ఆయన ఆలోచన. అందుకోసమే తన శాసనసభ్యులు తిరగకుంటే తోక కత్తిరిస్తానని బెదిరిస్తున్నాడని ఒక సీనియర్ రాజకీయ విశ్లేషకుడు అన్నారు. నేతలకి నాయకుడికి మధ్య నేరుగా సంబంధాలు లేకపోతే ప్రజాక్షేత్రంలో నెగ్గుకురావడం చాలా కష్టమని, జగన్‌మోహన్‌రెడ్డి అవలంభిస్తున్న విధానం వల్ల ఖచ్చితంగా కొంత నష్టం జరిగే అవకాశం లేకపోలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఏదిఏమైనా మరికొన్ని నెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో ఒక్కొక్కరుగా వ్యతిరేక వాణిని వినిపించడం శుభ సంకేతం కాదన్నది కూడా ఆయన భావన. మొత్తంమీద 'గడప గడపకు' వివాదం ఏ పరిణామాలకు దారితీస్తుందోనన్న ఆందోళన మాత్రం పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది.

# రాత్రివేళ గస్తీ ముమ్మరం చేయాలి

రాత్రివేళల్లో ప్రజల భద్రతకు పోలీసులు గస్తీని ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు పోలీసులను ఆదేశించారు. ఇటీవల ఆయన రాత్రివేళ ఆకస్మికంగా పోలీసు గస్తీలను తనిఖీ చేశారు. గస్తీ విధుల్లో పోలీసు సిబ్బంది, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.



# చంద్రబాబుకు.. రావి మోహన్‌చౌదరి శుభాకాంక్షలు

తెలుగుదేశం పార్టీ కర్నాటక కోఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి ఈనెల 16న నారావారిపల్లెలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సారధ్యంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొని చంద్రబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణను, యువనేత నారా లోకేష్‌లను కూడా కలుసుకుని శుభాకాంక్షలు చెప్పారు. రానున్న ఎన్నికల్లో కర్నాటకలో తెలుగుదేశం పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై కూడా చంద్రబాబుతో కలసి చర్చించామన్నారు. కర్నాటక విషయంలో పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటామన్నారు.

# విద్యాదాత డిఆర్‌కు.. నివాళి



కావలి విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యాదాత దొడ్ల రామచంద్రారెడ్డి (డిఆర్) 13వ వర్ధంతి కార్యక్రమం ఇటీవల కావలిలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, డిఆర్ అభిమానులు పాల్గొని డిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'బామా' కార్యదర్శి లేబాకుల సుధాకర్‌రెడ్డి, శారద తదితరులు పాల్గొన్నారు. జవహర్‌భారతి డిగ్రీ కాలేజీ ప్రాంగణంలోని డిఆర్ స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి, విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కరెస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని డిఆర్‌కు నివాళులర్పించి ఆయన సేవలను జ్ఞాపకం చేసుకున్నారు. అనంతరం పేదలకు, వృద్ధులకు దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

# వేగం కన్నా..ప్రాణం మిన్న!




వేగం కన్నా ప్రాణం మిన్న' అని, అయితే అది కేవలం నినాదం మాత్రం కాదని, అందరూ ఆచరించాల్సిన విషయమని జిల్లా రెవిన్యూ అధికారి వెంకటనారాయణమ్మ చెప్పారు. ఈ నెల 18 నుండి 24 వరకు జరగనున్న జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ఈనెల 18న ఆమె కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ హాల్లో అందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, రహదారి భద్రత అనేది నిరంతర బాధ్యత అని, ప్రతి ఒక్కరిని చైతన్యపరచాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. రోడ్డుపైకి వచ్చే ప్రతిఒక్కరూ బాధ్యతగా రహదారి నిబంధనలను తెలుసుకొని ప్రమాదాలు జరగకూడదనే భావంతో ప్రవర్తించాలన్నారు. ముఖ్యంగా యువతీ యువకులు అతివేగంతో బైకులు నడపడం అనర్ధదాయకమని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మరీ ప్రమాదకరమన్నారు. కేవలం మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, కనుక డ్రైవింగ్‌లో జాగ్రత్తలు తప్పనిసరి అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో గత సంవత్సరంలో 892 ప్రమాదాలు జరిగాయని, అందులో 373 మంది మరణించారని, 988 మంది అంగవైకల్యం చెందారని, కుటుంబంలో ఇంటిపెద్ద మరణిస్తే ఆయా కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, అదే సమయంలో యుక్త వయసులో ఉన్న పిల్లలు మరణిస్తే ఆయా తల్లిదండ్రుల రోదన అలవికానిదని ఆయన ఆవేదనగా చెప్పారు. ఇన్‌చార్జి ప్రాంతీయ రవాణా అధికారి మురళీమోహన్ మాట్లాడుతూ, సీట్‌బెల్ట్ ధరించకుండా డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణం మరింత ప్రమాదకరమని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య , ట్రాఫిక్ డిఎస్పీ అబ్దుల్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ఎస్ఇ వెంకటసుబ్బయ్య

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సమర్పించిన ఆర్థిక అవశ్యకత, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 21వతేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఇ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో అభిప్రాయ సేకరణ జరుగుతుందని, నెల్లూరు నగరం, రూరల్ డివిజన్లకు సంబంధించి విద్యుత్‌భవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. నాయుడుపేట, గూడూరు, ఆత్మకూరు, కావలికి సంబంధించి ఆయా డివిజన్లలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగినవారు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# వందే ధనిక్ భారత్!



'వందే భారత్' అని ఒక కొత్త రకం రైలును దేశంలో ప్రవేశపెడుతున్నారు. ఇది 'రాజధాని... శతాబ్ది' వంటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు ఎక్కువ... బుల్లెట్ ట్రైన్‌కు బాగా తక్కువ.

మనవరకు మనకు ఇదో వండర్. మహావృక్షాలు లేనిచోట ఆముదం చెట్టే మహా వృక్షం అన్నట్టుగా.. గంటకు 180కిలోమీటర్ల వేగంతో ఇది పరిగెడుతుంది. కానీ, మన రైల్వేట్రాక్‌లు బాగా సుకుమారంగా ఉంటాయి. అందుకని, 130 కిలోమీటర్ల వేగాన్ని మించి తట్టుకోలేవు.

(జపాన్‌లో బుల్లెట్ ట్రైన్ అత్యధిక వేగం 603 కిలోమీటర్లు. చైనాలో బుల్లెట్ ట్రైన్ అత్యధిక వేగం సుమారు 500 కిలోమీటర్లు... 130 కిలోమీటర్ల వేగానికే మనకి పూనకాలు వచ్చేస్తున్నాయి... ఏదో చింపేస్తున్నామని)

ఈ 130 కిలోమీటర్ల వేగానికే మనం ఉబ్బితబ్బిబ్బైపోతున్నాం. 'భారత్ వెలిగిపోతోంది' అంటున్నాం.

ఒక 'వందే భారత్' రైలును సికింద్రాబాద్ – విశాఖపట్నం మార్గానికి కేటాయించిన కేంద్రం... రెండు తెలుగు రాష్ట్రాలకు ఏదో పెద్ద వరం ప్రసాదించింది అన్నట్టుగా కేంద్ర మంత్రులు, పెద్దలు మాట్లాడుతున్నారు.

ఈ రైలు తొలి ప్రయాణాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి పచ్చ జెండా ఊపి 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చారు.

అది చూసి ఇక్కడ, సికింద్రాబాద్‌లో పచ్చజెండా ఊపడానికి భారత రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీ నుంచి వచ్చారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై, ఇంకో మంత్రి కిషన్‌రెడ్డి, చాలామంది నేతలు కూడా జెండాలు ఊపారు.

ఈ ఏసీ రైలులో ప్రయాణికుల వసతులు... అహో అద్భుతం.. అధరహో... అంటూ వక్తలు తన్మయత్వానికిలోనై, పులకించిపోయారు.

ఈ రైలులో ఇతర సూపర్‌ఫాస్ట్ రైళ్లలో లాగా పడుకుని వెళ్లడానికి కుదరదు. కూర్చునే వెళ్లాలి.

మామూలు ఛైర్‌కార్, ఎక్జిక్యూటివ్ ఛైర్‌కార్ అని రెండు తరగతులు ఉన్నాయి. ఛైర్‌కార్‌కు అయితే సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి 1665 రూపాయలు. ఇది ఏ.సీ మొదటి తరగతి బెర్త్(పడుకుని వెళ్లవచ్చు. రగ్గు, దిండు, టవల్ కూడా ఇస్తారు) ధర కంటే కూడా అధికం. ఇక, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ అయితే ఏకంగా 3120 రూపాయలు టికెట్ ధరగా నిర్ణయించారు. ఈ రైలులో వసతులు విమానంలో లాగా ఉన్నాయని మన నేతలు సంబరపడిపోయారు.

ప్రఖ్యాత సినీ నిర్మాతలైన నాగిరెడ్డి, చక్రపాణిల వద్దకు ఓ ఔత్సాహిక నటుడు వచ్చి, "నేను అచ్చు ఎన్‌టీ రామారావులాగా నటిస్తాను సార్. ఓ అవకాశం ఇవ్వండి" అని ప్రాధేయపడ్డాడట.

"ఎన్‌టీ రామారావే ఉంటే... మళ్లీ నువ్వెందుకు..." అని వారు చమత్కరించారట.

నిజానికి సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య ఓ పది సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఉన్నాయి. ఓ పది విమానాలు నడుస్తున్నాయి. ఆ రైళ్లల్లో... ధనికులతో పాటు, గోచి, పాతరాయుళ్ళు కూడా వెళ్ళవచ్చు. ధనికులకే అయితే విమానాలు ఉన్నాయి. మరి, ఈ 'వందే భారత్' ఎందుకు అనేది అర్థం కాదు.

ఈ 'వందే భారత్' రైలు ఛార్జీలు... ఇతర రైళ్ల ఛార్జీలకంటే ఎక్కువ... విమాన ఛార్జీ కంటే కొంచెం తక్కువ. మరి, ఈ ట్రైన్‌లో ఎవరు ప్రయాణించాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు?

బాగా డబ్బులు ఉన్నవారు, వ్యాపార... పారిశ్రామిక... ఉన్నతాధికార వర్గాల వారి కోసమా? వారు అంతా వైజాగ్‌కు ఓ గంటలో చేరుకోడానికి హైదరాబాద్ నుంచి పది విమానాలు ఉన్నాయి. ప్రయాణ సమయం ఒక గంటే!

దేశమంతా 475 'వందే భారత్' రైళ్లను ప్రవేశపెట్టాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

చిత్రం ఏమిటంటే... దేశంలోని 130 కోట్లకు పైబడిన జనాభాలో 110 కోట్లకు పైబడిన జనాభా ప్రయాణానికి ఇవి ఉపయోగపడవు. వీటిల్లో జనరల్ కోచ్‌లు లేవు. స్లీపర్‌క్లాస్ బోగీలు లేవు.

దేశ జనాభా దాకా ఎందుకు... తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు తొమ్మిదిన్నర కోట్ల జనాభాలో సుమారుగా ఏడున్నర, ఎనిమిది కోట్ల మందికి ఈ 'వందే భారత్' రైలు.... ప్రయాణానికి పనికి రాదు.

సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించాల్సిన వారిలో ఎక్కువమంది ఏ రైలులో జనరల్ బోగీలు ఎక్కువగా ఉన్నయ్యో చూసుకుని, దానిపైకి ఎగబడతారు. రైలు ప్లాట్‌ఫారం మీదికి రాకముందే... టవల్స్, హ్యాండ్‌కర్ఛీఫ్‌లు వేసేసి సీట్లు ఆక్రమించేస్తారు. సీట్ల మీదో... సీట్ల కిందో... ఆ కూర్చునే బల్లల మధ్యనో, టాయిలెట్స్ దగ్గరో... నడవడానికి ఉన్న జాగాలోనో... తలుపుల దగ్గరో... నిలబడో... కూర్చునో.... హేండిల్స్ పట్టుకుని వేలాడుతూనో ప్రయాణిస్తుంటారు. ఇటువంటి జనాభా మన దేశంలో ఎనభై శాతానికి తక్కువ లేకుండా ఉంటారు.

మరి, కేంద్ర ప్రభుత్వం ఎవరిని లక్ష్యంగా పెట్టుకుని, ఈ 'వందే భారత్' రైళ్లను ప్రవేశపెడుతోంది? కేవలం ఎగువ మధ్య తరగతుల వారికోసమే ఈ రైళ్లు కదా!

అంటే, పన్నులు నిజాయతీగా చెల్లించే మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, పేదలు, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారు... కేంద్ర పాలకుల దృష్టిలో లేరు.

ఒక్కో 'వందే భారత్' రైలు నిర్మాణానికి సుమారు 120కోట్ల రూపాయల వ్యయం అవుతుంది. మొత్తం 475 'వందే భారత్' రైళ్లను పట్టాలు ఎక్కించాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.(ఇప్పటికి పట్టాలు ఎక్కించింది మాత్రం ఎనిమిదే)

ఈ 475 రైళ్ల నిర్మాణానికి దాదాపు 60వేల కోట్ల రూపాయల మొత్తం వ్యయం అవుతుంది. కానీ, అవి మన జనాభాలో 110-115 కోట్ల మంది ప్రజల ప్రయాణావసరాలకు ఉపయోగపడవు. అదీ మన పాలకుల ప్లానింగ్. మన జనానికి పనికి రాకపోయినా ఫరవాలేదు కానీ, ప్రచారానికి పనికి రావాలి అనేది పాలకుల ఆలోచనా విధానం.

ఈ అరవై వేల కోట్ల రూపాయలు ఆకాశం నుంచి ఊడి పడవు. 'వందే భారత్'లో ప్రయాణించే






ఆర్థిక స్తోమత ఏమాత్రం లేని పేదలు, ఎగువ పేదలు (అంటే దిగువ మధ్య తరగతి ప్రజలు), దిగువ పేదలు చెల్లించే పన్నులలోనుంచే కేంద్ర పెద్దలు ఎగువ మధ్య తరగతి వారి ప్రయాణ సరదాల కోసం 'వందే భారత్' రైళ్లను దేశం మీదికి వదులుతున్నారు.

జపాన్, చైనా, దక్షిణ కొరియాలోని రైలుట్రాక్‌లు 300 నుంచి 600 కిలోమీటర్ల వేగాన్ని కూడా తట్టుకోగలవు. అందుకే, ఆ పట్టాల మీద బుల్లెట్ ట్రైన్‌లు 600 కిలోమీటర్ల వేగంతో పరుగెడుతున్నాయి. మన రైల్‌ట్రాక్‌లు మాత్రం 130 కిలోమీటర్ల వేగాన్ని మించి తట్టుకోలేవు.అందుకే, 'వందే భారత్' రైలు 180 కిలోమీటర్ల వేగంతో నడవ గలిగినప్పటికీ, 130 కిలోమీటర్ల వేగానికే పరిమితం చేశారు.

'వందే భారత్' అయినా, లేక మరో పథకం అయినా.... కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రాధాన్యత, ఆలోచనా విధానం ఏమిటనేవి ఇక్కడ పాయింట్.

ఈ అరవై వేల కోట్ల రూపాయల వ్యయంతో... దేశంలోని 80% పేదలు దేశంలోని ఆ మూల నుంచి ఈ మూలకు ప్రయాణించ గలిగిన పూర్తిస్థాయి స్లీపర్ క్లాస్, జనరల్ బోగీల రైళ్లను ఓ నాలుగొందలు ప్రవేశపెడితే, వారికి ఎంత వెసులుబాటు!?

కార్మికులు, ఇతర లేబరు దేశంలో ఎక్కడ అవసరం అయితే... వారు అక్కడికి సులభంగా... చౌకగా... వేగంగా ప్రయాణించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించగలిగితే, దేశంలో మౌలిక సదుపాయాలు ఇబ్బిడిముబ్బిడిగా పెరగవా? దానివల్ల, పారిశ్రామికీకరణ పెరిగి... ప్రభుత్వానికి ఆదాయం పెరగదా?

మన దేశ విస్తీర్ణంలో పదోవంతు కూడా లేని ఇండోనేసియాలోని మౌలిక సదుపాయాలు... భవనాలు, రోడ్లు, బ్రిడ్జిలు చూట్టానికి రెండు కళ్ళూ చాలవు.

ఎందుకు ఇలా... అన్నది మన ప్రభుత్వాల అధినేతలు ఎప్పుడూ ఆలోచించిన భావన కలగదు.

ఆత్మస్తుతి, పరనింద, 'నేను...నా భార్య... నా పిల్లలు... నా చుట్టాలు... నా పార్టీ... తరువాత రాజకీయం'. ఇవే మన నేతలకు గీటురాళ్లు అనే భావన సమాజంలో బాగా స్థిరపడిపోయింది.

ఈ పరిస్థితిని సమూలంగా మార్చివేస్తారనే గంపెడు ఆశతో కాంగ్రెస్‌ను చరిత్ర చెత్తబుట్టకు పరిమితం చేసి నరేంద్ర మోడీని దేశం అక్కున చేర్చుకుంది.

అయినప్పటికీ, దేశ రాజకీయ నడకలో ఏమాత్రం మార్పు లేదు. అప్పుడు ఎలా నడిచిందో.... ఇప్పుడూ అలాగే నడుస్తోంది. కాకపోతే, నీతులు అదనం ఇప్పుడు. ఢిల్లీ నుంచి బెజవాడ దాకా నీతులే నీతులు.

కానీ, పాలనాపరంగా, దేశ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉన్నదో పరిశీలిస్తే...

- దేశ జనాభాలో ధనికులైన ఒక్క శాతం మందిలో... అంటే సుమారు ఒక కోటి ముప్పై లక్షల మంది వ్యక్తుల చేతిలో... దేశం మొత్తం సంపదలో 40% చిక్కుకుపోయి ఉంది.
- దేశ జనాభాలో అట్టడుగు నుంచి పైకి 50%జనాభా.. అంటే, సుమారు 65...70 కోట్ల మంది ప్రజల చేతిలో దేశ సంపదలో కేవలం మూడు శాతం మాత్రమే ఉంది.

ఈ రెండు అంకెలను చూస్తే... ఈ దేశాన్ని మన పాలకులు ఎటు తీసుకువెళుతున్నారో అర్థమవుతుంది.

అప్పుడు, 'వందే భారత్' లాంటి పేదల ప్రయాణ అవసరాలకు ఒక్క శాతం కూడా ఉపయోగపడని పబ్లిసిటీ పథకాలను పట్టుకుని జెండాలు ఎందుకు ఊపుతున్నారో అర్థం అవుతుంది.

దేశంలోని పదిమంది అత్యంత పెద్ద ధనికులపై ఓ 5శాతం పన్ను అదనంగా విధిస్తే గనుక దేశం మొత్తంమీద స్కూళ్ల నుంచి డ్రాప్ అవుట్ అయిన పిల్లలను తిరిగి వెనక్కి తీసుకువచ్చి, వారిని చదివించవచ్చునని ఓ ఆర్థిక మదింపు సంస్థ తన అధ్యయనంలో అభిప్రాయపడింది.

గౌతమ్ అదానీ అనే గుజరాతీ వ్యాపారిపై ఒక్క శాతం అదనపు పన్ను విధిస్తే, ప్రభుత్వానికి వచ్చే ఒక లక్షా డెబ్బైవేల కోట్లతో 50 లక్షల మంది ప్రాథమిక విద్యా ఉపాధ్యాయులను ఓ ఏడాది పోషించవచ్చు అని ఆ అధ్యయన నివేదికలో పేర్కొన్నారు.

కానీ, మన పాలకులు ఆ పని చేయరు. మరి, ఆ పారిశ్రామికులే మన రాజకీయ మహాపోషకులు కదా! వారికి చిన్నపాటి నొప్పి కలిగించే పని కూడా ఏదీ చేయరు.

కరోనా సమయంలో మన దేశంలో మధ్య తరగతి జీవులు, పేదలు, కూలీలు, కార్మికులు, చిన్న ఉద్యోగులు ఎదుర్కొన్న బాధలు వర్ణనాతీతం కదా! కూలీలు, లేబరు పిల్లాపాపలను చంకల్లో ఎత్తుకుని వందలాది కిలోమీటర్లు నడిచి వెళ్లారు. మార్గమధ్యంలో చనిపోయినవారు చనిపోయారు. వారికి ఉపశమనం కలిగించడానికి మన పాలకులు తీసుకున్న చర్యలు సముద్రంలో కాకి రెట్టలా వారికి ఏమాత్రం ఉపయోగపడలేదు.

కానీ, మన దేశంలోని బిలియనీర్ల సంపాదన మాత్రం కరోనా సమయంలో రోజుకు మూడు వేల ఆరు వందల కోట్ల వంతున పెరగడానికి చేయగలిగింది అంతా చేశారు. కేంద్రం పుణ్యమా అని కరోనా సమయంలో దేశంలోని బిలియనీర్ల సంఖ్య రెట్టింపు అయింది. ఈ దేశంలో పేదలను, అల్పాదాయవర్గాలను పాలకులు పట్టించుకోరు అని చెప్పడానికి, ఈ 'వందే భారత్' రైళ్లు ఓ ఉదాహరణ.

ఈ పేదలను మన పాలకులు ఒకే ఒక సందర్భంలో పట్టించుకుంటారు. రెండు చేతులూ పైకెత్తి నమస్కారాలు పెడతారు. కృత్రిమంగా కనిపించే దొంగ నవ్వులు నవ్వుతుంటారు. వారి పిల్లల్ని ఎత్తుకుని ఆడిస్తారు. వారి ముక్కులు తుడుస్తారు. వారి భుజాలపై చేతులు వేసి ఆప్యాయతలు ఒలకబోస్తారు.

ఆ సందర్భమే... ఎన్నికలు.

అవి ఒక్కసారి అయిపోయిన తరువాత, ఈ పేదలు... రైలు పట్టాల పక్కగా నిలబడి, గంటకు నూటయాభై కిలోమీటర్ల వేగంతో వెళ్లే 'వందే భారత్' రైళ్లను గుడ్లప్పగించి చూస్తూ ఉండడమే.

ఈ రైలుకు 'వందే ధనిక్ భారత్' అని పేరుపెడితే, మరింత అర్థవంతంగా.. పాలకుల అంతరంగానికి అద్దం పట్టేలా ఉంటుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# ప్రథమ వర్ధంతి



జననం
28.10.1948

నిర్యాణం
22.01.2022

## స్వర్గీయ డాక్టర్ జే.పి.రెడ్డి గారు

(డాక్టర్ పెళ్ళకూరు జయప్రసాద్‌రెడ్డి)

నెల్లూరులోని ప్రముఖ చర్మ మరియు సెక్స్ వ్యాధుల నిపుణులు

సౌమ్యశీలి, స్నేహశీలి, ప్రతిభాశాలి
నిత్యం చెరగని చిరునవ్వుతో అందర్నీ పలుకరించే
ఆత్మీయదీప్తి, అనురాగమూర్తి, మహోన్నత వ్యక్తి,
మాకు మార్గదర్శకులు, మా ఇంటి దైవం

## డాక్టర్ జే.పి.రెడ్డి గారు

(డాక్టర్ పెళ్ళకూరు జయప్రసాద్‌రెడ్డి)
స్వర్గస్తులై 22.01.2023 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా

ఆ మహనీయుని పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ...

భార్య : రాధామృత

కుమారులు - కోడళ్ళు
పెళ్ళకూరు చైతన్యరెడ్డి - ప్రతిమరెడ్డి
పెళ్ళకూరు సమన్యరెడ్డి - వైష్ణవి

మనుమడు :
పెళ్ళకూరు సాహిత్‌రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com